# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శనివారం 28-9-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 54 | పేజీలు 8 | వెల: రూ.1/-


## స్పీకర్‌ల సదస్సులో ప్రసంగించిన సభాపతి పోచారం



హైదరాబాద్, సెప్టెంబర్ 27: ఉగాండా రాజధాని కంపాలాలో 64వ కామన్వెల్త్ సభాపతుల సదస్సు జరిగింది. కామన్వెల్త్ సభాపతుల సదస్సులో పాల్గొన్న తెలంగాణ శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సదస్సులో ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. చట్ట సభల నిర్వహణలో శాస్త్ర సాంకేతిక అంశాల ప్రభావంపై పోచారం మాట్లాడారు. అనంతరం పోచారం యూరప్‌లో పర్యటిస్తారు. అక్టోబరు 6న రాష్ట్రానికి తిరిగి వస్తారు. ఆయనతో పాటు శాసనసభ కార్యదర్శి డాక్టర్ నరసింహాచార్యులు కూడా వెళుతున్నారు.

# తీరం దాటిన హికా

**- తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురవవు**

**- వాతావరణ శాఖ అధికారులు వెల్లడి**

హైదరాబాద్, సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ) : తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు తగ్గుముఖం పడుతాయని, భారీ వర్షాలు పడే అవకాశం లేదని హైదరాబాద్ వాతావరణ శాఖాధికారి రాజారాం ప్రకటించారు. శనివారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించారు. హికా తుపాన్ 24 రాత్రి తీరం దాటిపోయిందని, దీనివల్ల ప్రస్తుతం ఎలాంటి ప్రమాదం లేదంటున్నారు. గల్ఫ్ తీరం వైపు పయనించడం వల్ల దేశంపై ఎలాంటి ప్రభావం చూపించదన్నారు. కొద్ది రోజులుగా హైదరాబాద్‌లో వరుణుడు బీభత్సం సృష్టిస్తున్న సంగతి తెలిసిందే. దీంతో రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురుస్తాయన్న ప్రచారంతో ప్రజలు భయాందోనళకు గురవుతున్నారు. ఈ క్రమంలో వాతావరణ అధికారి రాజారాంతో మాట్లాడుతూ.. దక్షిణ మహారాష్ట్ర దీనిని ఆనుకుని ఉన్న గోవా, కర్నాటక, తూర్పు మధ్య అరేబియా సముద్రం ప్రాంతాల్లో 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందన్నారు. 24 గంటల్లో గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపారు. 2018లో మే నెలలో కేరళను రుతుపవనాలు తాకితే.. ఈ సంవత్సరం జూన్ నెలలో తాకాయన్నారు. జూన్ 21న కోస్తా, రాయలసీమలో జూన్ 22న తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రుతుపవనాలు విస్తరించాయన్నారు. పశ్చిమ, ఉత్తర తెలంగాణాల్లో సెప్టెంబర్ 27వ తేదీన భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని, సెప్టెంబర్ 28 నుంచి తేలిక పాటి నుంచి వర్షాలు కురుస్తాయన్నారు.

# ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

హైదరాబాద్, సెప్టెంబర్ 27: నగరంలోని రవీంద్రభారతిలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రులు మహమ్మద్ అలీ, గంగుల కమలాకర్, బీసీ సంక్షేమశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కమలాకర్ మాట్లాడుతూ... బీసీ సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. కొండాలక్ష్మణ్ బాపూజీ ముల్కీ ఉద్యమంతో పాటు అనేక ఉద్యమాలు చేశారు. తెలంగాణ కోసం ఉద్యమం చేసిన గొప్ప నేత. కొండాలక్ష్మణ్ బాపూజీ పేరుతో హార్టికల్చర్ యూనివర్సిటీ పెడుతున్నాం. బాపూజీ తెలంగాణలో పుట్టడం మన అదృష్టం. చివరి శ్వాస వరకు తెలంగాణ రావాలని కోరుకున్న వ్యక్తి. లక్ష్మణ్ బాపూజీ చరిత్ర భావితరాలకు తెలిసేలా సీఎం కృషి చేస్తున్నారు. బీసీ సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నాం. బీసీలకు రెసిడెన్సియల్ స్కూల్స్ ఏర్పాటు చేసిన ఏకైన సీఎం కేసీఆర్. బీసీలకు హైదరాబాద్‌లో 42 ఆత్మగౌరవ భవనాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.



జగిత్యాల లో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహ ఆవిష్కరణలో తెలంగాణ బీసీ కమీషన్ ఛైర్మన్‌బి ఎస్ రాములు, జీవన్ రెడ్డి యం.ల్. సి. , ధా. సంజీవ్ కుమార్ యం. ఎల్. ఏ. సంజయ్ కుమార్ ఎమ్మెల్యే

# నీలోఫర్‌లో పిల్లలపై క్లినికల్ ట్రయల్స్

**డాక్టర్ల కుమ్మక్కు ఘటనపై సర్కార్ సీరియస్**

**విచారణకు ఆదేశాలు**

హైదరాబాద్,సెప్టెంబర్27 (ఆర్ఎన్ఎ): నీలోఫర్ ఆస్పత్రిలో డాక్టర్ల దందా ఒకటి తాజాగా వెలుగు చూసింది.

తెలంగాణలో సర్కారు ఆస్పత్రుల తీరు మారడం లేదని ఆరోపణలు వచ్చాయి. చిన్నారులపై డాక్టర్లు క్లినికల్ ట్రయల్స్‌కు పాల్పడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫార్మా కంపెనీల కొత్త మందులు, వ్యాక్సిన్లను నీలోఫర్ వైద్యులు చిన్నారులపై ప్రయోగిస్తున్నారని సమాచారం. ఫార్మా కంపెనీల నుంచి డాక్టర్లకు భారీగా నజరానాలు అందుతున్నాయని తెలుస్తోంది. క్లినికల్ ట్రయల్స్‌పై డాక్టర్ల మధ్య ఘర్షణ తలెత్తడంతో పరస్పరం పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసుకున్నారు. ఈ ఘటనపై తెలంగాణ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.సాక్షాత్తు సిఎం కెసిఆర్ హెచ్చరించినా, ఆరోగ్యశాఖ మంత్రి ఈటెల రాజెందర్ ఆకస్మిక తనఖీలతో భయపెట్టినా దావాఖానాల సిబ్బంది తేలికగానే తీసుకుంటున్నారు. తాజాగా నీలోఫర్ ఆసుపత్రిలో డాక్టర్ల దందా వెలుగుచూడడంతో సర్వత్రా నిరసనలు వస్తున్నాయి. నీలోఫర్ ఆసుపత్రిలో చిన్నారులపై డాక్టర్లు క్లినికల్ ట్రయల్స్‌కు పాల్పడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫార్మా కంపెనీల కొత్త మందులు, వ్యాక్సిన్లను నీలోఫర్ డాక్టర్లు చిన్నారులపై ప్రయోగిస్తున్నారని సమాచారం. ఫార్మా కంపెనీల నుంచి డాక్టర్లకు భారీగా డబ్బులు తీసుకుంటున్నారని,క్లినికల్ ట్రయల్స్‌పై డాక్టర్ల మధ్య తలెత్తిన వివాదంతో ఈఘటన వెలుగులోకి వచ్చింది. సమాచారం తెలుసుకున్న తెలంగాణ ప్రభుత్వం ఈ ఘటనపై విచారణకు ఆదేశించింది.

# హైదరాబాద్‌లో వర్ష బీభత్సం

**- జలదిగ్బంధంలో లోతట్టు ప్రాంతాలు**

**- గోల్కొండ రహదారిపై కూలిన భారీ వృక్షం**

**- వాగులను తలపించిన రహదారులు**

**- తీవ్ర ఇబ్బందులు పడ్డ వాహనదారులు, ప్రయాణీకులు**

**- బోట్లపై తిరుగుతూ పాలప్యాకెట్లు అందించిన సిబ్బంది**

**- లోతట్టు ప్రాంతాల్లో పర్యటించిన జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ సిబ్బంది**

హైదరాబాద్, సెప్టెంబర్27 (ఆర్ఎన్ఎ) : హైదరాబాద్‌లో భారీ వర్షం భీభత్సం సృష్టించి.. గురువారం అర్థరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారు జాము వరకు ఏకదాటిగా వర్షం కురవడంతో హైదరాబాద్ రహదారులన్నీ జలదిగ్బంధమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇండ్లలోకి వర్షంపు నీరు చేరడంతో నివాసదారులు రాతంత్రా జాగారం చేయాల్సి వచ్చింది. కనీసం బయటకు రాలేని పరిస్థితిలో పలు కాలనీ వాసులున్నారు. నడుం లోతులో వర్షపు నీరు ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆనంద్ బాగ్‌లో పలు కాలనీలను జలదిగ్బంధలో చిక్కుకున్నాయి. ఇదిలా ఉంటే హైదరాబాద్‌లో నీట మునిగిన కాలనీల్లో జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ సిబ్బంది పర్యటించారు. బోట్లలో తిరుగుతూ.. ఇంటింటికి పాలు, కూరగాయాలు, టిఫిన్స్, వాటర్ ప్యాకెట్లు అందించారు. దీనికితోడు నిత్యావసర సరుకులు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇళ్లలోకి నీరు ప్రవేశించడంతో కనీసం వంట చేసుకొనే పరిస్థితిలో ఉన్నామని లోతట్టు ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. బియ్యం, సరుకులు కూడా నీటితో తడిచిపోయాయని , కనీసం తాగడానికి నీళ్లులేని పరిస్థితిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజులుగా వానలు బీభత్సం సృష్టిస్తున్నాయి. గురువారం కొంత తెరిపించిందని అనుకున్న తరుణంలో అర్ధరాత్రి ఒక్కసారిగా కుంభవృష్టి కురిసింది. రహదారులపై భారీగా నీరు చేరింది. అర్ధరాత్రి కావడంతో అంతగా ట్రాపిక్ జాం కాలేదు. ప్రధానంగా నివాసాలు, కాలనీల్లోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అపార్టమెంట్ సెల్లార్‌లోకి భారీగా నీరు వచ్చి చేరింది. వాహనాలన్నీ నీట మునిగిపోయాయి. దీంతో చిన్న పిల్లలకు పాలు, ఇతరత్రా ఆహార పదార్థాలు లేకపోవడంతో కుటుంబాలు ఇబ్బందులు పడ్డారు. ఎంఎస్ మక్తాలో సుమారు 200 ఇళ్లల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. ఉప్పల్, మియాపూర్, లకడీకపూల్ పరిసర ప్రాంతాల్లో 12 నుంచి 15 సెం.మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, అమీర్ పేట, మాసబ్ ట్యాంక్, ఖైరతాబాద్, లింగంపల్లి, చందానగర్, మియాపూర్, అల్వాల్, తిరుమలగిరి ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మారేడ్ పల్లి, సైనిక్ పురితో పాటు పలు ప్రాంతాల్లో కుండపోతగా వర్షం కురిసింది. గుడి మల్కాపూర్‌లో అత్యధికంగా 15 సెం.మీటర్ల వర్షపాతం నమోదైంది.

రంగంలోని దిగిన జీహెచఎంసీ సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. రోడ్లపై నిలిచిన నీటిని కాల్వల్లోకి పంపిస్తున్నారు. ఇక ఉప్పల్ మెట్రో ప్లే ఓవర్ రహదారిపై భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. వాహనదారులు ఇక్కట్లకు గురయ్యారు. నగర వాసులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. వర్షం ధాటికి కాలాపత్తంలోని ఓ స్కూల్ గోడ కూలి పార్కింగ్ చేసిన కారుపై పడిపోయింది. దీంతో కారు ధ్వంసమైంది. వర్షపు నీటితో ముంపునకు గురయిన ప్రాంతాలను నగర మేయర్ బొంతు రామ్మోహన్ గౌడ్, విజిలెన్స్ డైరెక్టర్ విశ్వజిత్‌లు పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. మక్తల్ పరిసర ప్రాంతాల్లో నివాసాల్లోకి వర్షపు నీరు చేరడంతో వారంతా రాత్రి జాగరణ చేశారు. గోల్కొండ ప్రధాన రహదారిపై భారీ వృక్షం కూలిపోయింది. దీంతో రెండు వైపులా భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. సంఘటన స్థలానికి జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ సిబ్బంది చేరుకుని భారీ వృక్షాన్ని తొలగించారు. క్పేట్ ప్రధాన రహదారిపై భారీగా వరదనీరు చేరింది. దీంతో ట్రాఫిక్ పోలీసులు రోడ్డును మూసివేశారు. మరోవైపు హుస్సేన్ సాగర్‌లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. పైనుంచి వరద ప్రవాహం వస్తుండడంతో అధికారులు గేట్లు ఎత్తి నీటిని మూసీ కాల్వలోకి విడుదల చేస్తున్నారు. రెండు రోజుల నుంచి నగరంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మొత్తం 26తూముల ద్వారా 3,486 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కవాడిగూడ, అశోక్‌నగర్, చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి, కోరంటి ఆసుపత్రి, సత్యానగర్, రత్నానగర్ మీదుగా మూసీ ప్రధాన కాల్వలోకి వరద నీటిని విడుదల చేశారు. నాలల పరీవాహక ప్రాంతంలో ఉన్న నివాసితులను అధికారులు అలర్ట్ చేశారు. ప్రజలు నదిలోకి దిగరాదని హెచ్చరికలు జారీ చేశారు.

# బతుకమ్మ సంబరాలకు తెలంగాణ సిద్ధం

**9రోజుల పాటు ఘనంగా సాగనున్న ఉత్సవాలు**



హైదరాబాద్,సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ నిలువుటద్దం. ఆడపడుచులు 9 రోజులపాటు ఆటపాటలు, బతుకమ్మలతో సందడి చేస్తుంటే చూడడానికి రెండు కండ్లు సరిపోవు. తెలంగాణ ఆడపడచులకు మాత్రమే ప్రత్యేకమైన పండగ ఇది. సంవత్సరానికి ఒకసారి వచ్చే ఇలాంటి పండుగలు అసాంతం కన్నుల పండువగా జరుపుకొని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటారు. ఈ నెల 28వ తేదీన ఎంగిలి పువ్వు బతుకమ్మ మొదలుకొని అక్టోబర్ 6వ తేదీన జరిగే సద్దుల బతుకమ్మ వరకు వివిధ ప్రాంతాల్లో ఈ ఉత్సవాలు జరుగనున్నాయి.

మహిళలు 9 రోజులపాటు బతుకమ్మలు పేర్చి, బొడ్డెమ్మను కొలిచి, గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేయడం ఆనందకర విషయం. తెలంగాణ వ్యాప్తంగా జరుగుతున్న బతుకమ్మ పండుగ ఆడపడుచులకు ఆనందాలను తెచ్చి పెట్టింది. బుధవారం జరిగే సద్దుల బతుకమ్మ మరింత ఇంపుని తేనుంది. వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, ఆటపాటలతో ఎంజాయ్ చేయడం సంవత్సరమంతా గుర్తుండి పోయేలా చేస్తుంది. ఇన్నాళ్లూ ఒక్కేసి పువ్వేసి చందమామ అంటూ బొడ్డెమ్మను మనసారా కొలిచారు. అందరూ ఒక్కచోట చేరి సందడి చేశారు. బతుకమ్మ ఆటపాటలు, కోళాటాలతో హుషారెత్తించారు. కన్నులపండువగా సాగిన బతుకమ్మ సంబురం అందరినీ ఆకట్టుకుంది. చివరిరోజు సద్దుల బతుకమ్మ సందర్భంగా తెలంగాణ అంతటా బతుకమ్మ సంబరాలకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. బంతి, చేమంతితదితర పుష్పాలతో బతుకమ్మలను అందంగా పేర్చి ఆడుకున్నాక బతుకమ్మలను నిమజ్జనం చేస్తారు.


# ఉత్తమ్ ఓటమిని అంగీకరించినట్లే : ఎమ్మెల్సీ కర్నె

హైదరాబాద్,సెప్టెంబర్ 27 : హుజుర్‌నగర్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి తప్పదని ప్రభుత్వ విప్, టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ పేర్కొన్నారు. టీఆర్ఎస్ఎల్పీలో కర్నె ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. తమ పార్టీ నాయకులపై ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శలు చేస్తుంటే.. ఎన్నికలు కాకముందే ఓటమిని అంగీకరించినట్లు అనిపిస్తోంది. కోదాడలో చెల్లని పైసా హుజుర్‌నగర్ ఎలా చెల్లుతుంది? అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు ఓటమి తప్పదు. నిజాయితీని నమ్ముకున్నప్పుడే గెలుపు సాధ్యమవుతుంది అని కర్నె ప్రభాకర్ స్పష్టం చేశారు.

వెన్ను చూపి పారిపోయిన నాయకులను ప్రజలు నమ్మరు. వారిని ఉత్తర కుమారులు అంటారు. మాట మీద నిలబడరు. కానీ యుద్ధంలో నిలబడిన వారిని మాత్రమే ధీరుడు, వీరుడు అని అంటారు. రాజకీయాల్లో సిన్సీయార్టి తప్ప సీనియార్టి ఉండకూడదు. రాజకీయాల్లో వయసుతో పని ఉండదు. నిబద్ధతతో పని చేసే వ్యక్తివి అయితే మాట మీద నిలబడాలి.

2018 ఎన్నికల్లో గద్వాలలో జరిగిన బహిరంగ సభలో కేటీఆర్.. ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సవాల్ విసిరారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని.. దానికి ఉత్తమ్ కూడా సిద్ధమా? అని కేటీఆర్ సవాల్ విసిరారు. ధీరుడు అని అనుకుంటే, మాట మీద నిలబడే ధైర్యముందనుకుంటే తన సవాల్‌ను స్వీకరించాలన్నారు కేటీఆర్. తాను కూడా సవాల్‌ను స్వీకరిస్తున్నానని ఉత్తమ్ అన్నాడు. కానీ మాట మీద నిలబడలేదు. అధికారంలోకి రాకపోతే సన్యాసం తీసుకుంటానన్న ఉత్తమ్ మాట తప్పిండు అని కర్నె ప్రభాకర్ తెలిపారు. కోదాడలో ఆయన భార్య ఓడిపోగానే హుజుర్‌నగర్‌లో పోటీకి పెట్టిండు. ఈ ఎన్నికలు ప్రాజెక్టులు నిర్మిస్తున్న ప్రభుత్వానికి, ప్రాజెక్టులు అడ్డుకుంటున్న పార్టీకి మధ్య జరుగుతున్నాయని కర్నె ప్రభాకర్ చెప్పారు.

## చరిత్రలో నేటినిజం




కం॥ సైతానుల మధ్యన - కుల
వైతరణిని దాటుబూని - పద్యములోనన్
కైతలు రచియించిన - నవ
వైతాళికుడైన "జాషువా"ను దలంతున్ !!

( సెప్టెంబర్ 28 గుర్రం జాషువా జయంతి)

-రాధశ్రీ

సెల్: 9494481210



# నగరంలో యుద్ధప్రాతిపదికన రోడ్ల మరమ్మత్తులు

**కూలిన చెట్ల తొలగింపు...జోన్లలో పర్యటిస్తున్న అధికారులు**

హైదరాబాద్,సెప్టెంబర్27 (ఆర్ఎన్ఎ): నగరంలో గత మూడురోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయడంతోపాటు నీటి నిల్వలు, రోడ్లపై ఇసుక, బురద మేటలను తొలిగించడంలో జీహెచ్ఎంసీ అత్యవసర బృందాలు, డిజాస్టర్ రెస్క్యూ బృందాలు పూర్తిస్థాయిలో నిమగ్నమయ్యాయి. ఇప్పటికే నగరంలోని ప్రధాన రహదారుల్లో గత రాత్రే నీటి నిల్వలను తొలిగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. రోడ్లపై గుంతలను పూడ్చివేయడం, ధ్వంసమైన మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు, వర్షపునీటి నిల్వలను తొలిగించడం తదితర పనుల్లో ఇంజినీరింగ్, శానిటేషన్ సిబ్బంది పూర్తిస్థాయిలో నిమగ్నమయ్యారు. ప్రతి సర్కిల్‌లో నీటి నిల్వల ప్రాంతాలు, కూలిన పురాతన, శిథిలావస్థ భవనాలు, గోడల వివరాలు, దెబ్బతిన్న రోడ్లు, ఏర్పడ్డ గుంతలు తదితర వివరాలను సేకరించి వెంటనే చర్యలు చేపడుతున్నారు. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు నగరంలో విస్తృతంగా పర్యటించి సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. నగరవ్యాప్తంగా కూలిన దాదాపు 50 చెట్లను తొలిగించి రాకపోకలను సుగమం చేశారు. అదనపు కమిషనర్ సిక్తా పట్నాయక్ ఉదయం సికింద్రాబాద్ సర్కిల్‌లోని లాలాపేట్, వారాసిగూడ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి పారిశుధ్య పరిస్థితిని పరిశీలించారు. ఎంటమాలజీ విభాగం ద్వారా నగరంలోని పలు సమస్యాత్మక ప్రాంతాల్లో విస్తృతంగా లార్వా నివారణ స్ప్రేయింగ్‌ను చేపట్టారు.

# బతుకమ్మ పండగకు ఘనంగా ఏర్పాట్లు

జనగామ,సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ): జనగామ జిల్లాలో బతుకమ్మ వేడుకులు అంగరంగ వైభవంగా నిర్వహించేలా ఏర్పాటుల చేస్తున్నారు. అలాగే జనగామలో సద్దుల బతుకమ్మ వేడుకలను భారీగా నిర్వహిస్తారు. బతుకమ్మ ఉత్సవాలను గతంలో కన్నా వైభవంగా జరిపేందుకు కలెక్టర్ కృష్ణారెడ్డి చర్యలు తీసుకుంటున్నారు. బతుకమ్మ, దసరా పండుగలను ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. సద్దుల బతుకమ్మ, దసరాను పండుగలను స్నేహపూరితంగా, అన్నాదమ్ముల్లా కలిసి, మెలసి నిర్వహించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగికుండా చూడాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దసరా పండుగలను ప్రశాంతంగా, శాంతియుతంగా నిర్వహించాలని కోరారు. పండుగల సందర్భంగా గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూడాలన్నారు. బతుకమ్మకు అన్ని గ్రామాలు ముస్తాబవుతున్నాయి.

# సమాధానం ఇచ్చేవారే లేరు. ..!

నేటినిజం

శనివారం 28-9-2019

దేశంలో సుమారు అయిదు లక్షల అరవైఆరువేల ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో భవంతులే లేని నాలుగు లక్షలు ఉన్నాయి. మరుగుదొడ్లకు నోచుకోనివి లక్ష. మధ్యాహ్న భోజనానికి ముఖం వాచినట్లున్నవి లక్షా పన్నెండువేలు. ఇలాంటి వివరాలు తెలిసి బేజారెత్తిపోయి సర్కారీ బడుల్లో తాగునీరు, మరుగుదొడ్ల లాంటి కనీస వసతులు కలిపించేలా చూడాలని మొరపెట్టుకుంటూ ఇటీవల సర్వోన్నత న్యాయస్థానంలో ప్రజా ప్రయోజన వ్యాఖ్య ఒకటి దాఖలయింది. పరిస్థితి విని గుండె ద్రవించిపోయిన న్యాయస్థానం అన్ని ప్రభుత్వ పాఠశాలలోను వీలయినంత ఎక్కువగా మరుగుదొడ్లు నిర్మించాలని, ముఖ్యంగా ఆడపిల్లలు చదివేచోట తప్పని సరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్మాణపరంగా ఏదేని సమస్యలు తలెత్తినప్పటికీ తాత్కాళిక ఏర్పాట్లు చేసి డిసెంబరు కల్లా పక్కా నిర్మాణాలు చేయాలని ఆదేశించింది. గడువు దాటిపోయిందే కానీ ప్రభుత్వాలు లక్ష్యసాధనవైపు యోజనాల దూరంలో నిలబడిపోయి తీరికగా కాలక్షేపం చేస్తోంది. ఇదే మాట ముఖం పై అంటే మాత్రం చిరాకులు వస్తాయి. అవినీతి పాలనకు సమానార్థకం చేయడంలో బ్రహ్మాండమయిన పురోగతి సాధించిన గడ్డమీద విద్య విషయంలో అనితరమయిన, సాధ్యమయిన ప్రగతి నమోదయింది. మరి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 24వేల పాఠశాలల్లో సరయిన సౌకర్యాలు లేవని అయిదేళ్లక్రితమే ఉన్నత న్యాయస్థానానికి స్వయంగా విద్యామంత్రిత్వ శాఖే విన్నవించింది. కానీ రెండేళ్ళ తర్వాతయినా పరిస్థితులు అని ఆరాతీసినా సమాధానం ఇచ్చేవారే లేరు.

రాష్ట్రంలో ఉన్నది దాదాపు 77 వేల ప్రభుత్వపాఠశాలలు. అందులో మరుగుదొడ్లు లేనివి 31వేలు. ఇక బల్లలు కుర్చీలు అనే ఆలోచనే లేదు. ఎందుకంటే అలా ఏమీలేనివి అప్పట్లో 39 వేలు. ఇక టాయిలెట్లు లేని పాఠశాలలు 47వేలుగా లెక్కతేలాయి. ఇది అబద్ధం అనే మాట అనడానికి వీలు లేదు. ఎందుకంటే రాజీవ్ విద్యామిషన్ గా పేరు మారిన సర్వశిక్షా అబియాన్ అధికారిక వెబ్‌లో అన్నివివరాలు ఉన్నాయి. 53 వేలకు పైగా ప్రాథమిక,జి ప్రాథమికోన్నత, మాధ్యమిక పాఠశాలలు అమ్మాయిలకు మరుగుదొడ్ల సౌకర్యమే లేదని గణాంకాలు ఖచ్చితంగా చూపుతున్నాయి. ఇవి ప్రతిపక్షాలో, లేక స్వచ్ఛంద సంస్థలో, శతృవులో పుట్టించిన విషయాలు కావని ఒప్పుకోక తప్పవు. లేదా రెండు గోడలు అటు ఇటు కట్టించడం,మరుగుదొడ్లు ఉన్నట్లు లెక్కల్లో రాసుకోవడం ఆనవాయితీగా మారింది మరి. వీటి మూలంగా విద్యార్థినుల నీరు తాగితే వెళ్లవలసి వస్తుందని తక్కువగా నీరు తాగుతుండటం జరుగుతోంది. దాంతో ఆరోగ్య సమస్యలు తలెత్తి కొన్నాళ్ళకు చదువుకే దూరం అవుతున్నారు. ఇవన్నీ ఎంతగా ఏకరువు పెట్టినా కనీసం ఆలోచన కూడా లేకపోవడం గమనార్హం. ఇంకా వింత ఏమిటంటే దేశంలో కొన్నిచోట్ల తరగతి గదుల్లో ఆవులు, గేదెలు సేదదీరుతున్నట్లు తనిఖీల్లో బయటపడింది. తరగతి గదుల్లో హాజరు తప్పని సరి అన్నపుడు అక్కడ పిల్లలు లేకున్నా కనీసం ఆవులు, గేదెలయినా హాజరయినట్లే కదా?

## పత్తి రైతులను వెన్నాడుతున్న కష్టాలు

### వర్షాలతో పంటదిగుబడులపై ఆందోళన

ఆదిలాబాద్,సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ):పత్తి రైతులను కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఆశతో పత్తిసాగు విస్తీర్ణాన్ని రైతులు గణనీయంగా సాగు చేయగా,ఇప్పుడు భారీవర్షాలతో దిగాలు పడుతున్నా రు. ఖరీఫ్‌సాగు మొదట్లో వర్షాలు లేక ఇబ్బందులు పడ్డ రైతులు 15 రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల పత్తి సాగు దెబ్బతింటోంది. జిల్లాలో రైతులకు ప్రతీ యేటా కష్టం తప్పడం లేదు. అకాల వర్షం, ప్రకృతి బీభత్సంతో పత్తి రైతులు గోస పడుతున్నారు. సాగు ప్రారంభంలోనే నకిలీ విత్తనాలతో ఇబ్బందులు పడ్డారు. తెలంగాణ ప్రభుత్వం అనుమతించని బీటి-3 విత్తనాలను ఆంధ్రా, మహారాష్ట్రల నుంచి తీసుకవచ్చి అమ్మకాలు జరిపారు. అందులో నకిలీ విత్తనాలు కూడా రైతులకు అంటగట్టారు. కలుపు తీయడానికి కూలీల ఖర్చు భారంగా మారింది. దీనికి తోడు వాన దెబ్బ రైతులను మరింత కృంగదీసింది. పంట చేతికి వచ్చే దశలో పూత రాలిపోతుండగా దోమకాటు, రసం పీల్చేపురుగులు దాడి చేస్తున్నాయి. దీంతో పంట పై పెట్టుకున్న ఆశలు రైతులు వదులుకునే పరిస్థితి కనిపిస్తోంది. వరుసగా కురుస్తున్న వర్షాలతో పత్తి ఎర్రబారుతుండగా.. కాయ కుళ్లిపోతోంది. మరోవైపు రసం పీల్చే పురుగు నష్టపరుస్తోంది. తెలంగాణ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ, సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తోంది. పొడవు గింజ పత్తి కనీసం మద్దతు ధర క్వింటాలుకు రూ.5550, మధ్య పింజ పత్తి రూ.5255 మద్దతు ధరను కూడా ప్రభుత్వం ప్రకటించింది. వరుస వర్షాలతో దిగుబడి వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. పంట చేజారిపోతుండడంతో ఆవేదన చెందుతున్నారు. సాగు విస్తీర్ణాన్ని భారీగా పెంచుకొని దిగుబడి కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాల వల్ల ఇబ్బందులు పడుతున్నారు. కాయ దశకు వచ్చిన పత్తికి పురుగు, తెగుళ్ల దాడి పెరిగిపోయింది. తెల్లదోమ భారీగా పెరిగింది. రసం పీల్చే పురుగు తోడైంది. దీనికి తోడు గులాబీ రంగు పురుగు పొంచి ఉండడంతో రైతులు భయపడుతున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాల వల్ల తెగుళ్లే కాకుండా మెగ్నీషియం లోపం కూడా తలెత్తుతోంది.

## గిరిజన గూడాల్లో మళ్లీ జ్వరాలు

### రవాణా సౌకర్యం లేక వైద్యానికి ఇబ్బందులు

ఆదిలాబాద్,సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ): గిరిజన గూడాల్లో విషజ్వరాలెఉ మరోమారు భయపెడుతున్నాయి. రవాణా సౌకర్యం లేకపోవడంతో వైద్యం కోసం వారు గూడాలను వదిలి రాలేక పోతున్నారు. ఒక్కో ఇంట్లో కనీసం ఇద్దరు సభ్యులు జ్వరాలతో బాధపడుతున్నారు. డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా, చికెన్‌గున్యా, కామెర్లతో గిరిజనులు నరకం చూస్తున్నారు. దీని ప్రభావంతో ప్రైవేట్ ఆసుపత్రులన్నీ రోగులతో కిటకిటలాడుతున్నాయి. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉన్నా ప్రత్యేక క్యాంపులకు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. ఇకపోతే సింగరేణి కుటుంబాలపై జ్వరం పంజా విసురుతోంది.. ఫలితంగా బొగ్గుగని కార్మికులు, వారి కుటుంబసభ్యులు విలవిల్లాడు తున్నారు. పెద్దాచిన్నా ముసలీ ముతకా అనే తేడా లేకుండా అందరూ మంచం పట్టారు. సింగరేణిలో జ్వరాలు ప్రబలేందుకు అసలు కారణం దోమలే.. కార్మికవాడలు చిట్టడవులను తలపిస్తున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఇళ్ల చుట్టే మురుగు పారుతోంది. ఫలితంగా దోమలు, ఈగలు ఆవాసం ఉంటూ వ్యాధులను కలుగజేస్తున్నాయి. కనీసం అంబులెన్స్‌లో వైద్యసదుపాయం కూడా ఏర్పాటు చేయకపోవడం యజమాన్యానికి కార్మికుల పట్ల ఉన్న శ్రద్ధను సూచిస్తోంది. అక్కడి ప్రజలు కన్నీళ్ల పర్యాంతమవుతున్నారు. జి కార్మికులు.. వారి కుటుంబసభ్యులు వివిధ రకాల విషజ్వరాలతో విలవిల్లాడిపోతున్నా యాజామన్యం ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తోన్నాయి. సింగరేణి కార్మికులు అధికశాతం జీవనం సాగించే కాలనీల్లో విషజ్వరాలతో వణుకుతోంది. కేవలం కాలనీలను సందర్శించి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. బొగ్గు ఉత్పత్తికి, రవాణాకు కొనుగోళ్లకు ఇచ్చిన ప్రాధాన్యత తమ ఆరోగ్యాలకు మాత్రం ఇవ్వడం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు.

## బతుకమ్మ చీరలను వెలకట్టలేం- ఈటల

కరీంనగర్,సెప్టెంబర్27(నేటినిజం ప్రతినిధి): బతుకమ్మ చీరల పంపిణీ అన్నది పేదల ఆత్మగౌరవానికి సంబంధించినదని వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ద ఈనిని ఇతరత్రా దేనితో వెలకట్టలేమన్నారు. జమ్మికుంటలో బతుకమ్మ చీరలను మంత్రి పంపిణీ చేశారు. బతుకమ్మ చీరల వెల కట్టడానికి కాదు.. ప్రేమకు నిదర్శనమని ఈటల రాజేందర్ చెప్పారు. తెలంగాణ ఆడబిడ్డలను గౌరవించడానికి బతుకమ్మ చీరలు ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి కోసమే 30 రోజుల ప్రణాళిక కార్యక్రమం అమలు చేస్తున్నామని మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినగియోగించుకుని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు పరీక్ష కానున్న ఎన్నికలు

హైదరాబాద్, సెప్టెంబర్ 27:కొన్ని రాష్ట్రాల్లో త్వరలో జరగనున్న ఎన్నికలు కాంగ్రెస్‌కు పరీక్ష లాంటివే. ఇప్పటికే బిజెపి ప్రచార రంగంఓలకి దూసుకుని పోగా, కాశ్మీర్ అంశంతో ఆత్మవిశ్వాసంతో ఉంది. మహారాష్ట్ర,హర్యాన తదితర రాష్ట్రాలకు ఎన్నికలు జరుగనున్నాయి. జనవరి 5 వరకూ గడువున్న జార్ఖండ్ అసెంబ్లీకి కూడా వీటితోపాటే ఎన్నికలుండవచ్చునని చాలామంది అంచనా వేశారు. కానీ మూణ్ణెల్ల ముందు జార్ఖండ్‌లో ఎన్నికలు జరపడానికి ఎన్నికల సంఘం సిద్ధపడలేదు. ఎన్నిక తేదీల సంగతెలా ఉన్నా కాంగ్రెస్ ఏ మేరకు ప్రజల వద్దకు వెళ్లనుందన్నదే ఇప్పుడు ప్రశ్న. సోనియా నాయకత్వంలో మరోమారు ఎన్నికల సవాళ్లకు దిగనున్నారు. ప్రియాంక కూడా ఏ మేరకు ప్రభావం చూపనుందన్నది చూడాలి. నాథుడు లేని నావలాగా తయారనైన కాంగ్రెస్ ఏ మాత్రం ప్రభావం చూపకపోగా, ప్రజల్లో కూడా పెద్దగా సానుభూతిని దక్కించు కోలేదు. ట్రిపుల్ తల్లాక్, 370 ఆర్టికల్ రద్దుతో మోడీ నేతృత్వంలోని బిజెపి బాహుబలిని తలపిస్తోంది.

సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల తీర్పు వెల్లడైన నాలుగు నెలల తర్వాత మహారాష్ట్ర, హర్యానా శాసనసభలకు ఎన్నికలు జరగబోతున్నాయి. వచ్చే నెల 21న ఈ రెండు రాష్ట్రాల్లోనూ ఎన్నికలుంటాయని, 24న ఫలితాలు వెలువడతాయని కేంద్ర ఎన్నికల సంఘం శనివారం ప్రకటించింది. వీటితోపాటు 18 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 64 నియోజకవర్గాల్లో కూడా ఉప ఎన్నికలుంటాయి. హర్యానా అసెంబ్లీ గడువు నవంబర్ 2తో ముగియనుండగా, మహారాష్ట్ర అసెంబ్లీ గడువు అదే నెల 9తో పూర్తవుతుంది. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తినిచ్చే 370 అధికరణ రద్దు, ఆర్థిక రంగం ఒడిదుడుకులు వంటి పరిణామాలు ఈ నాలుగునెలల వ్యవధిలో చోటుచేసుకున్నాయి. వీటికితోడు మహారాష్ట్ర, హర్యానాల్లో బీజేపీ ప్రభుత్వాల పనితీరు, అక్కడున్న సమస్యలు కూడా జనం ముందున్నాయి. కనుక జనం తీర్పు ఎలా ఉంటుందన్న ఆసక్తి అందరిలోనూ ఉంది. జమ్మూకశ్మీర్ అంశంలో దేశంలో బిజెపి పట్ల సానుకూల ధోరణి ఉంది. ఆర్థిక రంగంలో నెలకొన్న అస్థిరత, పర్యవసానంగా ఎదుర్కొంటున్న సమస్యలపై జనంలో కొంత అసంతృప్తి ఉన్నా జనంలో మాత్రం బిజెపి అంటే దమ్మున్న పార్టీగా పేరు సంపాదించింది. ఈమధ్య కేంద్రం వరసబెట్టి తీసుకుంటున్న కొన్ని చర్యలు బిజెపిని మరింత బలోపేతం చేశాయి. ఈ దశలో వీటిని ఎలా ఎదుర్కొటుం దన్నదే కాంగ్రెస్ ముందున్న ప్రశ్న. పాలనపై ప్రజా భిప్రాయం ఎలా ఉందో... వారి అంచనాలకు తగ్గట్టు తాము పాలించగలిగామా లేదా అన్న విష యాల్లో ఏదో మేరకు సంశయాలుంటాయి. కానీ ఈ రెండుచోట్లా బీజేపీ సమరోత్సాహంతోనే ఉంది. బీజేపీకి ప్రధాన ప్రత్యర్థిగా ఉండే కాంగ్రెసే అయోమయావస్థలో ఉంది.

ఈ రెండుచోట్లా బీజేపీ గెలుపుపై ఎవరికీ పెద్దగా అనుమానాలు లేవు. ప్రధాన ప్రత్యర్థి పక్షం కాంగ్రెస్ నిస్తేజం కావడం ఇందుకు ప్రధాన కారణం. మహారాష్ట్రలో కాంగ్రెస్‌తోపాటు ఎన్‌సీపీ కూడా సంక్షోభంలో ఉంది. రెండు పార్టీలూ సీట్ల పంపకంపై అవగాహన కొచ్చినా కీలక నేతలు బీజేపీ శిబిరానికి తరలిపోవడం వాటికి తలనొప్పిగా మారింది. గత నెలలో రాహుల్‌గాంధీ పార్టీ అధ్యక్ష పదవిని వదులుకోవడంతో సోనియాగాంధీ ఆ బాధ్యతలు స్వీకరించక తప్పలేదు. ఈలోగానే ముంచుకొచ్చిన రెండు రాష్ట్రాల ఎన్నికలు ఆమెకు పెను సవాలుగా మారాయి. 370 అధికరణ రద్దు విషయంలో పార్టీ నేతలు తలోవిధంగా మాట్లాడటం, పార్టీలో అంతర్గత కుమ్ములాటలు కాంగ్రెస్‌ను తీవ్రంగా దెబ్బతీసేలా ఉన్నాయి. మొత్తానికి ఈ రెండు రాష్ట్రాల ఎన్నికలూ కాంగ్రెస్‌కు అగ్నిపరీక్ష అని చెప్పక తప్పదు. మహారాష్ట్రలో మరో ప్రధాన పార్టీ ఎన్‌సీపీ సైతం ఏటికి ఎదురీదుతోంది. మహారాష్ట్రలో బీజేపీ, దాని ప్రధాన మిత్రపక్షం శివసేన అనేక అంశాల్లో పరస్పరం విభేదించుకుంటున్నా ఈ ఎన్నికల్లో కూటమిగా జనం ముందుకొచ్చేందుకు

సిద్ధమవుతున్నాయి. అయితే సీట్ల పంపకాలు పొరపొచ్చాలు లేకుండా పూర్తవుతాయా అన్నది చూడాల్సి ఉంది. ఆ విషయంలో రెండు పార్టీలమధ్యా తీవ్ర వైరుధ్యముంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో చివరి వరకూ సీట్ల పంచాయతీ తెగకపోవడంతో రెండు పార్టీలూ విడివిడిగా పోటీచేశాయి. ఎన్నికల అనంతరం కూటమి సర్కారులో శివసేన చేరింది. లోక్ సభ ఎన్నికల్లో ఇద్దరూ కలిసే పోటీచేశారు. తొలిసారి ఠాక్రే కుటుంబం ఎన్నికల బరిలో నిలబడబోతోంది. శివసేన యువజన విభాగం యువసేన అధ్యక్షుడు ఆదిత్య ఠాక్రే ఈ ఎన్నికల్లో పోటీచేస్తారు. ఆయనకు సహజంగానే సీఎం పదవిపై కన్నుంది. లోక్‌సభ ఎన్నికలకు ముందు జరిగిన ఒప్పందం ప్రకారం రెండు పార్టీలూ అసెంబ్లీలో చెరిసగం స్థానాలు తీసుకోవాలన్న ఒప్పందం కుదిరిందని శివసేన చీఫ్ ఉధవ్ ఠాక్రే అంటు న్నారు. సీట్ల పంపకాల చిక్కుముడుల్ని రెండు పార్టీలూ ఎలా పరిష్కరించుకుంటాయన్నది వేచి చూడాలి.అసెంబ్లీలో మొత్తం 288 స్థానాలుంటే అందులో బీజేపీకి 122, శివసేనకు 63మంది సభ్యుల బలం ఉంది. మొత్తం అసెంబ్లీ స్థానాలను చెరిసగం పంచుకుందామని శివసేన ప్రతిపాదిస్తోంది. ఫడణవీస్ మహా జనసందేశ్ యాత్ర కార్యక్రమం కింద ప్రజలకు చేరువ కావడానికి ప్రయత్నించారు. వరదల కారణంగా ఈ యాత్ర రెండు దఫాలుగా నిర్వహించాల్సివచ్చింది. అటు శివసేన కూడా చురుగ్గానే ఉంది. హర్యానాలో 90 స్థానాలుంటే బీజేపీ గత ఎన్నికల్లో 47 గెల్చుకుంది. ఈసారి 75 స్థానాలు లక్ష్యంగా పెట్టుకుంది. అధికారంలోకొచ్చిన కొత్తలో జాట్‌ల కోటా ఉద్యమాన్ని, అనం తరం రాంరహీం సింగ్ అరెస్టు, అనంతరం జరిగిన హింస వంటి అంశాల్లో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న ఖట్టర్ ఆ తర్వాత నిలదొక్కుకున్నారు. మొత్తంగా ఈసమస్యలు కాంగ్రెస్ ఎలా పరిష్కరించుకుని ముందుకు సాగుతుందో చూడాలి.

# కొత్త మద్యం వ్యాపారులకు నిరాశ

### గడువు పెంచడంతో ఆయోమయంలో సిండికేట్లు

హైదరాబాద్,సెప్టెంబర్27 (ఆర్ఎన్ఎ): మద్యం దుకాణాల లైసెన్సు గడువును ప్రభుత్వం మరోనెల రోజుల పాటు పొడిగించడంతో అక్రమ మద్యం వ్యాపారులకు కలసి వచ్చేలా ఉంది. ఎలాగైనా మద్యం దుకాణాలను దక్కించుకొని వ్యాపారం చేయాలనకొని భావించి ఔత్సాహికుల ఆశల పై సర్కారు నిర్ణయం తాత్కలికంగా నీళ్లు చల్లినట్లయ్యింది. ఈనెల 30 వరకు పాత మద్యం దు కాణాల గడువు ముగిసిపోనుండడంతో ఎలాగైనా ప్రభుత్వం మళ్లీ మద్యం దుకాణాలకు టెండర్లను నిర్వహిస్తుందని వీరంతా భావించారు. ఇందులో భాగంగా నే చాలా మంది నిరుద్యోగులు భాగస్వాములుగా ఏర్పడి మద్యం దుకాణాలను దక్కించుకోవాలని భావించారు. సర్కారు నెల రోజుల పాటు మద్యం దుకాణాల కేటాయింపులపై వాయిదా వేయడంతో వారంతా నిరాశకు గురయ్యారు. ప్రభుత్వం ఇప్పటి వరకు మద్యం దుకాణాల కేటాయింపులపై స్పష్టమైన విధానం రూపొందించకపోవడం అలాగే చివరి వరకు దీనిపై స్పష్టత ఇవ్వకపోవడంతో ప్రస్తుత మద్యం వ్యాపారు ల్లోనూ, కొత్తగా వ్యాపారంలోకి ప్రవేశించాలనుకున్న వారిలో ఉత్కంఠ కొనసాగింది. కాగా కొత్త మద్యం పాలసీ అక్టోబరు 1నుంచి మొదలు కానున్నట్లు ప్రచారం జరిగిన క్రమంలో జిల్లాలోని పలు పల్లెల్లో బెల్ట్ షాపుల దందాకు తెర లేచింది. మొ న్నటి వరకు కొన్ని గ్రామాల్లో బెల్ట్ షాపులు లేకపోగా , ఈసారి ఆగ్రామాల్లో ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఇందు కోసం ఆయా గ్రామాల్లోని వీడీసీలు బెల్ట్ షాపుల కోసం అనధికారిక టెండర్లను సైతం నిర్వహిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా పట్టణ ప్రాంతాల్లో సైతం వీడీసీలు సమాంతరం వ్యవస్థను నడుపుతున్నట్లు ఆరోపణలున్న నేపథ్యంలో దానికి అనుగుణంగానే ఈ బెల్ట్ షాపులకు వేలం పాటలు నిర్వహిస్తూ తమ ఆధిపత్యం ధోరణిని ప్రదర్శిస్తున్నాయంటున్నారు. ఇలా గ్రామాల్లో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా ఏర్పడుతున్నాయి. ఇటు పోలీసలు అటు ఎక్సైజ్ అధికారులు ఈ బెల్ట్ షాపుల వ్యవహారంపై సీరియస్‌గా చర్యలు తీసుకోకపోవడంతో వీడీసీల ఆధిపత్యం కొనసాగుతోంది. మరోవైపు గడువు పెంచడంతో ప్రస్తుతం మద్యం వ్యాపారుల ఊపిరిపీల్చుకున్నారు. నిబంధనల ప్రకారం మద్యం లైసెన్సు గడువు ఈనెల30వతేదీ వరకే ముగియనుంది. అయితే అక్టోబరు 1నుంచి కొత్త మద్యం పాలసీ అమలు కావాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం సరియైన పాలసీ రూపొందించకపోవడంతో గత్యంతరం లేక వాయిదా వేయాల్సి వచ్చింది. దీంతో పాటు ఇటీవలే బార్‌ల లైసెన్సును సైతం మరో ఏడాది పాటు పొడగిస్తూ కూడా ఆదేశాలు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో చాలా మంది ఔత్సాహిక వ్యాపాంలు ఈసారి మద్యం దుకాణాలను నిర్వహించేందు కోసం ప్రభుత్వం నిర్వహించే డ్రాలో పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. ఈసారి దరఖాస్తు రుసుం రూ. 2లక్షలు చేయనున్నట్లు ప్రచారం కూడా జరిగింది.

# చీరల పంపిణీతో చేనేతకు ప్రోత్సాహం

సిద్దిపేట,సెప్టెంబర్27 (ఆంఎన్ఎ): బతుకమ్మ చీరలతో సిరిసిల్ల చేనేతకు చేతినిండా పనికల్పించన ఘనత మంత్రి కెటిఆర్‌కే దక్కుతుందని దుబ్బాక ఎమ్మెల్యే రామలింగారెడ్డి అన్నారు. వారికి పని హామీ దక్కిందన్నారు. దీంతో పాటు చేనేతలను ప్రోత్సహించిన ఘనత కెసిఆర్ సర్కార్‌కు దక్కిందన్నారు. దీనిని విమర్శించాలనుకునే వారిని తాము పట్టించుకోదల్చుకోలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర సాంప్రదాయ ప్రాధాన్యతను చాటి చెప్పడానికే ప్రభుత్వం బతుకమ్మ చీరలను పంపిణీ చేయడం జరుగుతుందని మంత్రి అన్నారు. పలుచోట్ల ఎమ్మెల్యే బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో బతుకమ్మ సంబురాల కోసం ఆడపడుచులకు కోటి చీరలను పంపిణీ చేయడం జరుగుతుంద న్నారు. కెసిఆర్ పాలనలో రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని అందులో చీరల పంపిణి కూడా ఒకటన్నారు. రైతుల పంటలను సస్యశ్యామలం చేసేందుకు కాళేశ్వరం నుంచి మేడిగడ్డ వద్ద నుంచి నీరును శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి సరఫరా చేయడం జరుగుతుందన్నారు.

## ఆర్బిటర్ బాగా పనిచేస్తోంది

### – 'విక్రమ్'తో ఎలాంటి సంకేతాలు రాలేదు

### – ఇస్రో చైర్మన్ శివన్

బెంగళూరు, సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ) : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంద్రయాన్ – 2 ఆర్బిటర్ చాలా బాగా పనిచేస్తోందని ఇస్రో ఛైర్మన్ శివన్ వెల్లడించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఆర్బిటర్‌లో అమర్చిన పరికరాలన్నీ బాగా పనిచేస్తున్నాయని చెప్పారు. ల్యాండర్ 'విక్రమ్'తో సంబంధాలు తెగిపోయినా తమకు ఎలాంటి సంకేతాలు రాలేదని.. ఆర్బిటర్ మాత్రం బాగానే పనిచేస్తోందన్నారు. అసలు 'విక్రమ్' నుంచి సంబంధాలు ఎందుకు తెగిపోయాయా? తప్పులేమైనా జరిగాయా? అనే అంశంపై జాతీయ స్థాయి కమిటీ విశ్లేషిస్తోందన్నారు. ఆ కమిటీ నివేదిక సమర్పించిన తర్వాత భవిష్యత్తు కార్యాచరణ చేపట్టే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతానికైతే తమ తదుపరి ప్రణాళికపై పని చేస్తున్నామని చెప్పారు. తదుపరి ప్రయోగానికి అవసరమైన చర్యలు తీసుకోవడంపై దృష్టిపెట్టి పనిచేస్తున్నామన్నారు. ఇస్రో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన చంద్రయాన్ 2 ప్రయోగం 98శాతం విజయవంతమైందని ఇటీవల శివన్ వెల్లడించిన విషయం తెలిసిందే. తమ తదుపరి లక్ష్యం 'గగన్‌యాన్ మిషన్' అని ఆయన ప్రకటించారు. ఇస్రో చరిత్రలో గగన్ యాన్ మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు కానుంది. 2022 నాటికి భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపడమే ఇస్రో లక్ష్యంగా పెట్టుకుందని, సాయుధ బలగాల్లో ఫ్లయింగ్ అనుభవం ఉన్న టెస్ట్ పైలట్లను వ్యోమగాములుగా పంపాలని భావిస్తోంది.

## వాద్రాను కస్టడీకి అప్పగించండి

### –హైకోర్టుకు ఇడి వినతి

న్యూఢిల్లీ,సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ): ప్రియంక బర్త రాబర్ట్ వాద్రాను తమ కస్టడీకి అప్పగించాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. అక్రమ లావాదేవీల కేసులో నేరుగా ఆయన ప్రమేయం ఉన్నందున ఆయనను విచారించేందుకు అవకాశం ఇవ్వాలని ఈడీ విన్నవించింది. ఈ కేసులో విచారణకు రాబర్ట్ వాద్రా సహకరించడంలేదంటూ జస్టిస్ చంద్రశేఖర్ ధర్మసనానికి నివేదించింది. ఆయనకు ట్రయల్ కోర్టు మంజూరు చేసిన ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని కోరింది. లండన్‌లోని బ్రిన్‌స్టన్ స్క్వేర్‌లో రూ.17 కోట్ల ఖరీదైన ఓ ఎ÷-లాట్‌ను కొనుగోలులో వాద్రా అక్రమ లావాదేవీలు నెరిపినట్టు ఈడీ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. కాగా తమ క్లయింట్ ఈడీ అధికారులకు పూర్తిగా సహకరిస్తున్నారని, ఎప్పుడు సమన్లు ఇచ్చినా విచారణకు హాజరయ్యారని వాద్రా తరపు న్యాయవాది వాదించారు. ఈడీ అడిగిన ప్రతి ప్రశ్నకు వాద్రా సమాధానం చెప్పారనీ.. తనపై వచ్చిన ఆరోపణలను ఒప్పుకోనంత మాత్రాన ఆయన సహకరించలేదని భావించరాదంటూ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం కోర్టు ఈ కేసు తుది విచారణను నవంబర్ 5కు వాయిదా వేసింది.

## అప్పులకుప్పగా తెలంగాణ

### బడ్జెట్ కేటాయింపులే ఇందుకు నిదర్శనమన్న భట్టి

### హుజూర్‌నగర్‌లో గెలుస్తామన్న రాజనర్సింహ

హైదరాబాద్,సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ): తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క విమర్శలు గుప్పించారు. కేసీఆర్‌ది అంకెల గారడీ బ్జడెట్ అని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణను కేసీఆర్ అప్పుల ఊబిలోకి నెట్టారని మండిపడ్డారు. 2024 వరకు రాష్ట్ర అప్పులు రూ.5లక్షల కోట్లకు చేరనున్నాయని చెప్పారు. కేంద్రం నుంచి వచ్చే నిధులను చూపుతూ కేసీఆర్ అబద్దాలు చెబుతున్నారని ఆయన చెప్పారు. రాష్ట్రానికి రాబడి తక్కువ... అప్పులు ఎక్కువ ఉన్నాయని విమర్శించారు. తెలంగాణ అప్పులను ఎలా తీరుస్తారో కేసీఆర్ చెప్పాలని భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. అప్పులు కట్టడానికేనా ప్రజలు పోరాడి తెలంగాణ సాధించుకున్నది? అని భట్టి అన్నారు. హుజూర్‌నగర్‌లో గెలిచేది కాంగ్రెస్సేనని ఆ పార్టీ నేత దామోదర రాజనర్సింహ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నేతల మాటలకు కార్యకర్తలు కన్ఫ్యూజ్ కావద్దని సూచించారు. హుజూర్‌నగర్ ఉప ఎన్నికను రెఫరెండంలా భావించలేమన్నారు. టీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్తే సీఎం కేసీఆర్ పాలనకు రెఫరెండంగా భావించవచ్చని అభిప్రాయపడ్డారు. ఉప ఎన్నికల తర్వాతే పార్టీలో మార్పులుంటాయని తెలిపారు. కేసీఆర్‌కు విశ్వసనీయత ఉంటే ఆర్టీఐని పూర్తి స్థాయిలో అమలు చేయాలని చెప్పారు. అప్పుడు కేసీఆర్ బినామీలు బయటపడతారని రాజనర్సింహ పేర్కొన్నారు.

# ప్రాజెక్టులపై ఏడుపు తప్ప మరో పనిలేదు

## -కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ ఈద

కరీంనగర్,సెప్టెంబర్27 (ఆర్ఎన్ఎ): ప్రాజెక్టులపై కాంగ్రెస్ నేతలకు అవగాహన లేదని, మిడ్ మానేర్ ప్రాజెక్టు నాణ్యతపై అసత్య ప్రచారం చేస్తున్నారని తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఐడీసీ) చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి అన్నారు. ప్రాజెక్టును అడ్డుకోవడం, విమర్శలు చేయడం వారు పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ఏనాడూ ప్రాజెక్టుల తీరుతెన్నులను పరిశీలించిన పాపాన పోలేదన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన కాంగ్రెస్ నాయకుల తీరుపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌కు తెలంగాణ ప్రభుత్వంపై నమ్మకం లేకపోతే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్ హయాంలో మిడ్‌మానేరు ప్రాజెక్టు కట్ట పనిని 80 శాతం పూర్తి చేశారు. కట్టపని చేసిన కాంట్రాక్టర్‌ను కోమటిరెడ్డి బ్రదర్స్ చర్చకు తీసుకు రావాలన్నారు. అబద్దాలు చెప్పే కాంగ్రెస్ నేతలు క్షమాపణ చెప్పే పరిస్థితి వస్తుంది. ప్రస్తుతం నీటి విడుదల ప్రాజెక్టు నియమ నిబంధనలకు లోబడే చేస్తున్నామని ఆయన తెలిపారు. కొమటిరెడ్డి బ్రదర్స్ ఆధారాలతో వస్తే ఎప్పుడైనా.. ఎక్కడైనా.. చర్చకు సిద్ధమని ఈద శంకర్‌రెడ్డి స్పష్టం చేశారు. అంతేగానీ అదేపనిగా బురదజల్లే పనులు మానుకోవాలన్నారు. కాళేశ్వరంతో దశమారడం, రాష్ట్రంలో వ్యయసాయికంగా పురోబివృద్ది సాధించిడం కాంగ్రెస్‌కు గిట్టడం లేదన్నారు.

# నీటి వనరులను కాపాడుకోవాలి

## గవర్నర్ తమిళ సై పిలుపు

హైదరాబాద్,సెప్టెంబర్27 (ఆర్ఎన్ఎ): నీటి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని గవర్నర్ తమిళ సై అన్నారు. రానున్న రోజుల్లో నీటికి కటకట లేకుండా చూసుకోవాలన్నారు. నగరంలోని హెచ్ఐసీసీలో గ్రీన్ బిల్డింగ్ కాంగ్రెస్ -2019 సదస్సును గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై మాట్లాడుతూ స్వచ్ఛమైన నీరు లేనిదే ప్రపంచం లేదన్న నిజాన్ని గుర్తెరగాలన్నారు. నీటి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. రాజ్‌భవన్‌లో ప్లాస్టిక్ నిషేధం వినియోగించడంతో పాటు సోలార్ వినియోగం పెంచుతామని తెలిపారు. మట్టి పాత్రలను వినియోగిస్తామని చెప్పారు. వచ్చదనాన్ని పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను గవర్నర్ తమిళిసై అభినందించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాట ఇసంరక్షించాలని, నీటిని కాపాడుకోవాలని అన్నారు. ఈ సదస్సు నాలుగు రోజుల పాటు కొనసాగనుంది.

## ఉప ఎన్నిక రావడం మంచిది అయ్యింది

# టీఆర్ఎస్ గెలుపుతోనే ప్రాధాన్యం: శానంపూడి

నల్లగొండ,సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ): హుజుర్‌నగర్ ఉప ఎన్నిక రావడం మంచిదయ్యిందని టీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. ఇక్కడ టిఆర్ఎస్ మాత్రమే అభివృద్దికి పాటుపడగల దన్నారు. టిఆర్ఎన్ గెలిస్తేనే హుజూర్‌నగర్ ప్రాధనా÷-యం పెరగగలదన్నారు. గతంలో ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్న ఉత్తమ్ చేసిందేమీ లేదన్నారు. హుజూర్‌నగర్‌లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి టీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గత ప్రభుత్వ హయాంలో ఏడాది కాలం పాటు ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. మనం హెచ్చరించిన తర్వాత హైదరాబాద్ నుంచి ఎమ్మెల్యే వచ్చి సంతకాలు పెట్టేవాడన్నారు. ఇంతకు ముందు అట్లాంటి ఎమ్మెల్యే ఉండడం వల్ల పనులు కాలేదవన్నారు. ఇప్పుడు ఉప ఎన్నిక రావడం.. మీరు, మనం, హుజూర్‌నగర్ చేసుకున్న అదృష్టం అంటూ, అందుకు ప్రజలంతా స్పష్టతతో ఉన్నారని నఅ÷-నారు. టీఆర్ఎస్ పార్టీని గెలిపించేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారు. నియోజకవర్గమంతా గులాబీమయం అవుతోంది. ఊర్లకు ఊర్లు టీఆర్ఎస్‌లో చేరుతున్నాయి. టీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ప్రతి ప్లలె నమ్ముతోంది. ఈ ఉప ఎన్నిక మంచి అవకాశం. డబ్బులకు ఎవరూ లొంగిపోవద్దు. ఉత్తమ్ కుమార్ రెడ్డి అర్ధరాత్రి ఫోన్లు చేసి ప్రజలను మభ్య పెడుతున్నారు. అభివృద్ధి కోసం పోరాడే వాళ్లం. మనం అంటే ఏందో ఈ గడ్డ మీద చూపించాలి. ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించాలి. టీఆర్ఎస్ గెలిస్తే ఏం అభివృద్ధి జరుగుతోంది ప్రజలకు వివరించాలి అని శానంపూడి సైదిరెడ్డి ప్రజాప్రతినిధులకు సూచించారు.

# అరబిందో సమస్యలపై శంఖరావం

## 15న ఒకరోజు ఆందోళనకు సిఐటియూ హెచ్చరిక

శ్రీకాకుళం,సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ): అరబిందో కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే అక్టోబర్ 15 న ఒక రోజు సమ్మె చేపడతామని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు యాజమాన్యాన్ని హెచ్చరించారు. అరబిందో కార్మికుల చార్టర్ ఆఫ్ డిమాండ్లు పరిష్కరించాలని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ.. సిఐటియు ఆధ్వర్యంలో పైడి భీమవరంలో గురువారం అరబిందో కార్మికులు సమ్మె శంఖారావం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ.. అరబిందో కార్మికులు అతి తక్కువ వేతనాలతో దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయకుండా, అరబిందో యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల పేరుతో తీవ్ర శ్రమ దోపిడీకి పాల్పడుతుందని విమర్శించారు. గత 17 నెలలుగా చార్టర్ ఆఫ్ డిమాండ్లు పరిష్కరించకుండా యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. అరబిందో యాజమాన్యం సంవత్సరానికి 1800 కోట్లు రూపాయలు లాభాలు అర్జిస్తుందని అన్నారు. అరబిందో కార్మికులు యాజమాన్యానికి వస్తున్న లాభాలలో వాటా అడగడం లేదని, తాము కష్టపడుతున్నదానికి బతకడానికి తగిన వేతనం అడుగుతున్నారని అన్నారు. కార్మికులు ప్రాణాలు పణంగా పెట్టి పనిచేయడంతో యాజమాన్యం కోట్లాది రూపాయలు లాభాలార్జిస్తున్నదని అన్నారు. ధరలు విపరీతంగా పెరుగుతుంటే వేతనాలు పెంచకపోతే కార్మికులు ఎలా బతకాలని సిహెచ్.నర్సింగరావు ప్రశ్నించారు. కార్మికుల వేతనాలు పెంచకుండా, కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా పారిశ్రామిక అశాంతికి యాజమాన్యం కారణమవుతుందని సిహెచ్.నర్సింగరావు ధ్వజమెత్తారు.

# పిపిఎలపై కేంద్రం సూచనను పాటించాలి: జివిఎల్

విశాఖపట్టణం,సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ): వైసీపీతో తమకు రాజకీయ అనుబంధం లేదని, తప్పు చేస్తే నిలదీస్తామని బీజేపీ నేత జీవీఎల్ నరసింహారావు హెచ్చరించారు. గత ప్రభుత్వ అవినీతిపై ఆధారాలు ఉంటే చూపించాలన్నారు. పీపీఏలపై కేంద్రం సూచనను రాజకీయంగా చూడవద్దని, విద్యుత్ పీపీఏల విషయంలో ఎక్కువ ధరకు కొనలేదని తాము చెప్పలేదని చెప్పారు. ప్రధాని మోదీ అమెరికా వెళ్లి పెట్టుబడులు తెస్తున్న సమయంలో గందరగోళం వద్దని ఆయన పేర్కొన్నారు. రాజకీయ ఆరోపణలను ప్రోత్సహించమని, టీడీపీ నుంచి బీజేపీలో చేరిన ఎంపీల కేసులు ఏవీ మాఫీ కావని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు నచ్చి వారే వస్తున్నారని చెప్పారు. పోలవరం కాంట్రాక్టర్లను మార్చే హక్కు రాష్ట్రాలకు ఉందని, తక్కువ ధరకు సకాలంలో ప్రాజెక్ట్ పూర్తి చేస్తే అభ్యంతరం లేదన్నారు. ఏబీఎన్, టీవీ ప్రసారాల నిలిపివేత సరికాదని, మీడియా స్వేచ్ఛను కాపాడాలని జీవీఎల్ పిలుపునిచ్చారు.

## బ్యాంకర్లతో సమావేశమైన సీఎం వైఎస్ జగన్

అమరావతి,సెప్టెంబర్25(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రైతులకు రుణాల పెండింగ్, వైఎస్సార్ రైతు భరోసా అమలుపై ప్రధానంగా చర్చించారు.. అంతేకాకుండా వచ్చే నెల 15 నుంచి రైతు భరోసా అమలు చేయనుండటంతో రూపొందించాల్సిన విధివిధానాలపై కూడా బ్యాంకర్లతో సీఎం వైఎస్ చర్చించినట్టు తెలుస్తోంది. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు, సంబంధిత ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

# ఒడిషాలో సింగరేణికి బొగ్గుగనులు

## కేటాయిస్తూ కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ,సెప్టెంబర్27 (ఆర్ఎన్ఎ): ఒడిశాలో సింగరేణికి మరో కొత్త బొగ్గు బ్లాకును కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కేటాయించింది. 1040 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్న న్యూ పాత్రపాద బొగ్గు బ్లాకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బొగ్గు బ్లాకు నుంచి ఏడాదికి 200 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయడానికి అవకాశం ఉంది. బొగ్గు బ్లాకులు కేటాయించిన కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖకు సింగరేణి సీఎండీ శ్రీధర్ ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికే ఒడిశాలోని నైని బొగ్గు బ్లాకును సింగోణికి కేంద్రం కేటాయించింది.

నైని బొగ్గు బ్లాక్ కంటే మూడు రెట్లు పెద్దది న్యూ పాత్రపాద. ఒడిశాలోని నైని బ్లాక్‌కు సమీపంలోనే న్యూపాత్రపాద బొగ్గు బ్లాకు ఉంది. 2024 నుంచి న్యూపాత్రపాద బ్లాక్ నుంచి బొగ్గు ఉత్పత్తి చేయనున్నారు. ఒడిశాలోని బొగ్గు బ్లాకుల ద్వారా తక్కువ ఖర్చుతో బొగ్గును ఉత్పత్తి చేయొచ్చని సింగరేణి సీఎండీ తెలిపారు. ప్రస్తుతమున్న 67 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి నుంచి మరో ఏడేళ్లలో 100 మిలియన్ టన్నుల ఉత్పత్తికి చేరనుంది సింగరేణి సంస్థ. సింగరేణి సుదీర్ఘమైన భవిష్యత్‌ను ఆశిస్తూ విస్తరణ చర్యలు తీసుకుంటున్నట్లు సీఎండీ శ్రీధర్ తెలిపారు.

# విజయనగరం డిపోముందు ఆర్టీసీ కార్మికుల ఆందోళన

విజయనగరం,సెప్టెంబర్27 (ఆర్ఎన్ఎ): ఎపిఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్క్స్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విజయనగరం ఆర్టీసీ డిపో వద్దవిజయనగరం ఆర్టీసీ వర్కర్స్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి వి.రాములు మాట్లాడుతూ... విద్యుత్ బస్సుల పేరుతో ఆర్టీసీని ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నం జరుగుతుందని విమర్శించారు. కేంద్రం విద్యుత్ బస్సుల సబ్సిడీని ఆర్టీసీకీ ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సిసియస్, పియఫ్ లోన్లు వెంటనే మంజూరు చేయాలన్నారు. అలవెన్సుల ఒప్పందం వెంటనే పూర్తి చేయాలని కోరారు. అ÷-ధదె బస్సు, అవుట్ సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వంలో వీలినం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో డిపో కమిటీ సభ్యులు కెఆర్.కుమార్, పివి.రావు, జెఎస్.నారాయణ, విజయనగరం అద్దె బస్సు సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# వైకాపాకు పార్లమెంట్‌లో కార్యాలయం

న్యూఢిల్లీ,సెప్టెంబర్27 (ఆర్ఎన్ఎ): పార్లమెంట్‌లో టీడీపీ పార్టీ తమ పార్టీ కార్యాలయాన్ని కోల్పోయింది. గత కొన్ని సంవత్సరాలుగా పార్లమెంట్‌లో టీడీపీ కార్యాలయంగా కొనసాగుతున్న రూమ్‌ను లోకసభ స్పీకర్ కార్యాలయ అధికారులు వైసీపీ కి కేటాయించారు. గురువారం వివిధ పార్టీలకు సంబంధించి స్పీకర్ కార్యాలయ సిబ్బంది పార్లమెంట్ లో ఆఫీస్ లను కేటాయించారు. పద్దతి ప్రకారం ఒక పార్టీకి ఐదు స్థానాల కంటే ఎక్కువున్న పార్టీలకు ఎంపీల సంఖ్యను బట్టి కార్యాలయాలు కేటాయించారు. టీఆర్ఎస్ పార్టీకి గతంలో ఉన్న కార్యాలయాన్ని మళ్లీ ఇచ్చారు. మొత్తం 14 పార్టీలకు స్పీకర్ కార్యాలయం కార్యాలయాలను కేటాయించింది. దీంతో వైకాపాకు పార్టీ కార్యాలయం దక్కింది.




రామగుండం ఎరువుల కర్మాగారంపై అధికారులు ,ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించిన మంత్రి కెటిఆర్

# రామగుండం ఎరువు కర్మాగారం తెరిపిస్తాం

## ఇది తమ ప్రాధామ్యాల్లో ఉందన్న మంత్రి కెటిఆర్ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష

హైదరాబాద్,సెప్టెంబర్27 (ఆర్ఎన్ఎ): రామగుండం ఎరువుల కర్మాగారం తెరిపించాలన్నది తమ ప్రథమ ప్రాధాన్యమని పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ ప్రకటించారు. ప్రజలకిచ్చిన హామీ మేరకు రామగుండం ఎరువుల పరిశ్రమ పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోం దన్నారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సాధ్యమైనంత త్వరగా ఫ్యాక్టరీని పునః ప్రారంభించడానికి కసరత్తు ముమ్మరం చేసినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్.. రామగుండం ఫెర్టిలైజర్స్ కంపెనీ పునరుద్ధరణ పనులపై సమీక్ష నిర్వహించారు. మంత్రి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత, రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్, పరిశ్రమల శాఖ అధికారులతో కలిసి ఎరువుల కంపెనీ ప్రతినిధి బృందంతో సమావేశం అయ్యారు. కంపెనీ పునరుద్ధరణకు సంబంధించిన కార్యకలాపాల వివరాలను కేటీఆర్ అడిగి తెలుసుకున్నారు. రామగుండం ఎరువుల కంపెనీ పున:ప్రారంభానికి తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి కేటీఆర్ కంపెనీ ప్రతినిధి బృందానికి తెలిపారు. కంపెనీని తిరిగి ప్రారంభిం చడానికి అవసరమైన అన్ని సహాయ సహకారాలను అందిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజలకు హామీ ఇచ్చిన మేరకు కంపెనీ పునరుద్ధరణకు కృషి చేశామన్నారు. అందుకే, ఫ్యాక్టరీ పునరుద్ధరణలో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యక్ష భాగసామ్యం తీసుకుందని వివరించారు. ఫ్యాక్టరీకి అవసరమైన ఉద్యోగాల కల్పనలో సాధ్యమైనంత మేర స్థానికులకే అవకాశాలు ఇవ్వాలని కంపెనీ బృందాన్ని కేటీఆర్ కోరారు. తెలంగాణ అకాడమీ అఫ్ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ ద్వారా యువకులకు ప్రభుత్వ ఖర్చులతో శిక్షణ ఇస్తామని, అందులోంచి ఉద్యోగులను ఎంపిక చేసుకోవాలని ప్రతిపాదించారు. ముఖ్యంగా స్కిల్డ్, సెమీస్కిల్డ్ సిబ్బంది కోసం టాస్క్ ద్వారా ప్రత్యేక కోర్సులు తయారు చేసి, శిక్షణ ఇచ్చేందుకు సైతం సిద్దంగా ఉన్నామన్నారు. ఈ మేరకు ఆర్ఎఫ్‌సీఎల్‌తో కలిసి పనిచేయాలని సమావేశానికి హాజరైన టాస్క్ ప్రతినిధులను మంత్రి కేటీఆర్ ఆదేశించారు. దీంతోపాటు అన్ స్కిల్డ్ కార్మికులను జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ ఛేంజ్ ద్వారా భర్తీ చేసుకునే అవకాశాలను పరిశీలించాలన్నారు. రామగుండం ఎరువుల కంపెనీ పరిసరాల్లో గతంలో ఉన్న కేంద్రీయ విద్యాలయాన్ని తిరిగి ప్రారంభించాలని స్థానిక ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఈ సందర్భంగా కోరారు. దీనిపై స్పందించిన మంత్రి కేటీఆర్.. ఇందుకోసం కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రికి లేఖ రాస్తామని తెలిపారు. కంపెనీకి అవసరమైన రవాణ, హమాలీ వంటి అంశాల్లోనూ కంపెనీ పరిసర ప్రాంతాల్లోని ప్రజలను ఉపయోగించుకోవాలని మంత్రులు.. కంపెనీ ప్రతినిధి బృందాన్ని కోరారు. అటు మూత పడ్డ బిల్ట్ లాంటి కంపెనీలను తిరిగి ప్రారంభించేందుకు కూడా పరిశ్రమల శాఖ తరపున ప్రయత్నా లు చేస్తున్నామని మంత్రి కేటీఆర్ తెలిపారు.

# కర్నాటక ఉప ఎన్నికలపై ఇసి అనూహ్య నిర్ణయం

## ఎన్నికలను వాయిదా వేస్తున్నట్టు ప్రకటన సుప్రీంలో కేసు ఉన్నందుననే అని వెల్లడి

న్యూఢిల్లీ,సెప్టెంబర్27 (ఆర్ఎన్ఎ): కర్నాటకలో 15 అసెంబ్లీ స్థానాలకు గానూ వచ్చే నెలలో జరగాల్సిన ఉపఎన్నికలను వాయిదా వేయనున్నట్టు భారత ఎన్నికల సంఘం పేర్కొంది. అనర్హత వేటు పడిన ఎమ్మెల్యేల పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టులో ఈసీ ఈ మేరకు వెల్లడించింది. అనర్హత వేటును సవాల్ చేస్తూ ఎమ్మెల్యేలు దాఖలు చేసిన పిటిషన్ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. దీంతో ఈ కేసు తదుపరి విచారణ అక్టోబర్ 22కు వాయిదా పడింది.

వాస్తవానికి మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికలతో పాటు కర్నాటక ఉపఎన్నికలను కూడా ఒకే దశలో నిర్వహించేందుకు ఈసీ ఇటీవల షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో అక్టోబర్ 21 జరిగే ఉపఎన్నికలపై స్టే విధించాలని లేదా తమను ఈ ఎన్నికల్లో పోటీచేసేందుకు అనుమతించాలని కోరుతూ అనర్హతకు గురైన కర్నాటక ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మరోవైపు 17 మంది ఎమ్మెల్యేలపై అనర్హత విధించడం వంటి అంశాలపై ఎలా వ్యవహరించాలన్న దానిపై మార్గదర్శకాలు ఇవ్వాలంటూ కర్నాటక స్పీకర్ సుప్రీంకోర్టును కోరారు. దీంతో కర్ణాటక ఉప ఎన్నికలు వాయిదా పడ్డాయి. 15 స్థానాల్లో జరగాల్సిన ఉప ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. రెబల్ ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టు తీర్పు వచ్చాకే ఉప ఎన్నికలు నిర్వహిస్తామని ఈసీ స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌పై అక్టోబర్ 22న కోర్టు వాదనలు విననున్నది. కుమారస్వామి ప్రభుత్వంపై అవిశ్వాసం సందర్భంగా 17 మంది ఎమ్మెల్యేల మీద అప్పటి స్పీకర్ అనర్హత వేటు వేసిన విషయం విదితమే. ప్రస్తుత అసెంబ్లీ కాలం ముగిసే వరకు వారికి ఎన్నికల్లో పోటీ చేయడానికి వీల్లేకుండా స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో రెబల్ ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో వాదనలు జరుగుతున్నాయి. దీంతో ఈ వివాదం న్యాయస్థానంలో ఉన్నందున అది పూర్తయ్యే వరకు తాము 15 నియోజకవర్గాల్లో ఉప ఎన్నిక నిర్వహించబోమంటూ సుప్రీంకోర్టుకు సీఈసీ తెలియజేసింది. అనర్హత వేటు పడిన 17 మంది ఎమ్మెల్యేల పిటిషన్‌పై తాము పూర్తిగా విచారణ జరుపుతున్నామని సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ క్రమంలో తాము కూడా ఎన్నికలను వాయిదా వేస్తామని ఈసీ తరపు న్యాయవాది సుప్రీంకోర్టుకు తెలిపారు. ఉప ఎన్నికలు వాయిదా వేస్తే తమకెలాంటి అభ్యంతరం లేదని రెబల్ ఎమ్మెల్యేలు కోర్టుకు తెలిపారు.

# శ్రీశైలం,నాగార్జున సాగర్‌కు భారీగా వరద

శ్రీశైలం,సెప్టెంబర్27 (ఆర్ఎన్ఎ): ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రధాన జలాశయాలకు వరద పోటెత్తుతోంది. శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. అధికారులు 5 గేట్లను 10 అడుగులు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టుకు చేరుతున్న ఇన్‌ఎ÷-లో 1,68,000 క్యూసెక్కులు కాగా, ఔట్‌ఎ÷-లో 1,49,000 క్యూసెక్కులు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 215 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి సామర్థ్యం 213.8824 టీఎంసీలు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 884.70 అడుగులు. ప్రాజెక్టు కుడిగట్టు, ఎడమగట్టు విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోందని అధికారులు నివేదిక వెల్లడించారు.

మరోఎవైపు, నాగార్జున సాగర్‌కు వరద నీరు పోటెత్తుతోంది. అధికారులు 6 క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. సాగర్ ఇన్‌ఎ÷-లో 1,50,020 క్యూసెక్కులు కాగా, ఔట్‌ఎ÷-లో 65,070 క్యూసెక్కులు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 589.90 అడుగులుగా ఉంది. సాగర్ పూర్తి స్థాయి నీటిమట్టం 312 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి సామర్థ్యం 311.7462 టీఎంసీలుగా ఉంది.

# డ్వాక్రా రుణాలపై ఒత్తిడి తగదు: రామకృష్ణ

అమరావతి,సెప్టెంబర్27 (ఆర్ఎన్ఎ): డ్వాక్రా రుణాలపై బ్యాంకుల ఒత్తిడిని నివారించాలని సిపిఐ నేత రామకష్ణ కోరారు. ఈ మేరకు సీఎం జగన్‌కు సీపీఐ నేత రామకృష్ణ లేఖ రాశారు. రుణాల డబ్బును 10 రోజుల పాటు పొదుపు ఖాతాల్లో జమ చేసి డ్వాక్రా గ్రూపులపై అదనపు వడ్డీ భారం వేస్తున్నారు. రూ. 35 కోట్లు అదనపు వడ్డీ, ఇన్సూరెన్స్ పేరుతో రూ. 346 కోట్లను బ్యాంకులు డ్వాక్రా సంఘాల నుంచి వసూలు చేస్తున్నాయి. బ్యాంకు వసూళ్లు లెక్కగడితే పావలా వడ్డీ రుణాలు ప్రచార ఆర్భాటం మాత్రమే. బ్యాంకుల టార్గెట్‌ల నుంచి డ్వాక్రా మహిళలకు విముక్తి కల్పించాలని లేఖలో రామకృష్ణ డిమాండ్ చేశారు.

# మైనర్ బాలికపై మూడేళ్లుగా లైంగిక దాడి

ఏలూరు,సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ): మైనర్ బాలికపై మూడేళ్లుగా ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడుతున్న ఘటన వెలుగు చూసింది. పశ్చిమ గోదావరి జిల్లా చాగల్లు మండలం ఊనగట్లలో ఈ దారుణం చోటు చేసుకుంది. మైనర్ బాలికపై మూడేళ్లుగా నారగాని వీర వేంకటేష్ అనే వ్యక్తి లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. దీంతో బాలిక గర్భం దాల్చింది. ఆ విషయం బయటపెట్టవద్దని బాలికను నిందితుడు బెదిరించాడు. అయితే బాలికకు కడుపునొప్పి రావడంతో తల్లిదండ్రులకు విషయం తెలిసింది. వెంటనే వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## ఏపీ వార్తలు

# పోలవరం ద్వారా దోపిడీకి శ్రీకారం చుట్టారు

**- రూ.750కోట్లు తగ్గించామంటూ రూ.7500 కోట్లు నష్టం చేకూర్చారు**

**- వైసీపీ ప్రభుత్వ దురాక్రమాలపై గట్టిగా పోరాడుదాం**

**- పార్టీ నేతల టెలీకాన్ఫరెన్స్‌లో టీడీపీ అధినేత చంద్రబాబు**

అమరావతి, సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ) : పోలవరం ద్వారా వైసీపీ ప్రభుత్వం దోపిడీకి శ్రీకారం చుట్టిందని మాజీ సీఎం చంద్రబాబు ఆరోపించారు. గురువారం పార్టీ నేతలతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలవరం రివర్స్ టెండరింగ్‌పై ఆయన పార్టీ నేతలతో చర్చించారు. రివర్స్ టెండరింగ్‌తో వైసీపీ ప్రభుత్వం దోపిడీకి తెరలేపిందని అన్నారు. పోలవరానికి రూ.750 కోట్లు తగ్గించామంటూ.. రూ.7500 కోట్లు నష్టం చేకూర్చారని ఆరోపించారు. గతంలో ఎక్కువ కోట్ చేసిన సంస్థే ..ఇప్పుడు తక్కువకు కోట్ చేసిందన్నారు. ఎలక్ట్రిక్ బస్సులు క్విడ్ ప్రోకోలో భాగంగానే తక్కువకు కోట్ చేసిందని పేర్కొన్నారు. మెగాకు ఎలక్ట్రిక్ బస్సులు ఇచ్చేదానికి నిబంధనలు ఒప్పుకోవని సురేంద్రబాబు అడ్డుపడితే ఆయన్ని తప్పించారన్నారు. వరద తగ్గినా బోటు తీసే ప్రయత్నం చేయటం లేదని చెప్పారు. ప్రైవేటు సంస్థ ముందుకొచ్చి తీస్తామన్నా, వారికి అనుమతివ్వటం లేదన్నారు. ఇసుక పరిస్థితి దారుణంగా ఉందని తెలిపారు. ఇసుక కొరత వల్ల 20లక్షల మంది ఇబ్బంది పడుతున్నారని వివరించారు. తిరుమల తిరుపతి దేవస్థానాన్ని వివాదాలమయం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తుందని, తెదేపా నేతలపై కేసులు పెట్టడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారని అన్నారు. రాజకీయ కక్షతో పాలన సాగిస్తున్నారని విమర్శించారు. తెదేపా శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ఆరోపణలు వచ్చిన ఎక్కడికక్కడ ఖండించాలన్నారు. తెదేపా నేతల జోలికొస్తే అందరూ ఐక్యంగా ఎదుర్కోవాలని చంద్రబాబు అన్నారు. వైసీపీ దుర్మార్గపు రాజకీయాలు చేస్తుందని అన్నారు. రైతుల రుణమాఫీ ప్రభుత్వం పరిధిలోది అని, గతంలో మన హయాంలో రైతులకు రుణమాఫీ పూర్తిచేసేందుకు డబ్బులుసైతం సమకూర్చామని, కానీ వాటిని రిలీజ్ చేయకుండా అది టీడీపీ హయాంలోని హామీ అంటూ చెప్పడం అసంబద్ధమన్నారు. రైతులను ఆదుకోవాల్సింది పోయి రైతులకు ఇవ్వాల్సిన డబ్బులను మాకు సంబంధం లేదంటూ ఆపివేయడం ఎంతవరకు సమంజసమో వైసీపీ ప్రభుత్వానికే తెలియాలన్నారు. ప్రజల్లోకి వైసీపీ ప్రజావ్యతిరేఖ విధానాలను తీసుకెళ్లాలని అన్నింటిపైనా గట్టిగా పోరాడదామని పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశర చేశారు.

# రుణమాఫీని రద్దు చేయడం ద్రోహమే

**- వైసీపీ ప్రభుత్వం రైతువ్యతిరేఖ విధానాలకు నిదర్శనం**

**- టీడీపీ నేత యనమల రామకృష్ణుడు**

అమరావతి, సెప్టెంబర్27 (ఆర్ఎన్ఎ) : రైతులకు ఇవ్వాల్సిన రుణమాఫీ నిధులను నిలిపివేయడం వైసీపీ ప్రభుత్వం రైతు వ్యతిరేఖ ప్రభుత్వం అనడానికి నిదర్శనమని తెదేపా సీనియర్ నేత యనమల రామకృష్ణుడు మండిపడ్డారు.

గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.. రైతుల రుణమాఫీ జీవో 38 రద్దు చేయడం రైతన్నకు ద్రోహం చేయడమేనని అన్నారు. 33లక్షల మంది రైతులకు ఇవ్వాల్సిన 7,582 కోట్లను ఎగ్గొట్టడం బాధాకరమన్నారు. ఏ ప్రభుత్వమైనా పేదలకు పెట్టడంలో పోటీపడాలి కానీ, వైకాపా మాత్రం పేదల పొట్టగొట్టడంలో పోటీ పడుతోందని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు పూర్తి కాక ముందే.. 150మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిదర్శనమన్నారు.

రుణమాఫీ నాలుగో విడతకు సంబంధించి 2లక్షల మంది ఖాతాల్లో ఇప్పటికే 376కోట్లు జమయ్యాయని యనమల తెలిపారు.

మిగిలిన 3,603 కోట్లతో పాటు ఐదో విడతగా 3,979కోట్లు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల ముందు 'రైతుభరోసా' అన్న వైకాపా, ఇప్పుడు ఏకంగా రైతులనే బలి తీసుకుంటోందని ఆరోపించారు. గతంలో ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్ ప్రభుత్వాలు పాత పథకాలను కొనసాగిస్తూ.. కొత్త పథకాలను ప్రవేశ పెట్టారని గుర్తుచేశారు. గత ప్రభుత్వాల పథకాలను రద్దుచేసినవాళ్లని ఇప్పటి వరకు చూడలేదని యనమల దుయ్యబట్టారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రజావిరుద్ధ పాలన సాగిస్తున్నారని అన్నారు.

ఏ ప్రభుత్వం పథకాలు తెచ్చింది అని కాకుండా, ప్రజలకు ఎంత మేలు చేయాలన్నదానిలో జగన్ పోటీ పడితే బాగుంటుందని, అలా కాకుండా ఆ ప్రభుత్వం హామీని మేము అమలు చేయం అంటే ఇది ప్రజాస్వామ్యంలో మంచి విధానం కాదని అన్నారు. రుణమాఫీ అవుతుందని రైతులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారని, కానీ జగన్ తీరుతో వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఇప్పటికైన వైసీపీ ప్రభుత్వం పునరాలోచించి రైతుల రుణమాఫీని పూర్తి చేయాలని అన్నారు.

# నష్టాలను ఆపేందుకే ఆర్టీసీ ఉద్యోగుల విలీనం

విజయవాడ, సెప్టెంబర్27 (ఆర్ఎన్ఎ) : ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులలో విలీనం చేస్తున్న ప్రక్రియ జనవరి 1కి పూర్తయ్యేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఆర్టీసీ ఇంఛార్జ్ ఎండీ కృష్ణబాబు గురువారం చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తే రూ.3300 కోట్లు ఆర్టీసీకి మిగులుతాయని తెలిపారు. ఆర్టీసీ నెలకు 100 కోట్లు నష్టాన్ని ఎదుర్కొంటోందన్నారు. ఇందుకు కారణం, 2015 నుండి డీజిల్, జీతభత్యాలు పెరగడమని వివరించారు. అందుకోసమే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఉద్యోగులను విలీనం చేస్తే 3300 కోట్లు ఆర్టీసీకి మిగులుతుందన్నారు. డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రికల్ బస్సులు తీసుకురావాలని సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారని స్పష్టం చేశారు. డీజిల్ బస్సులకు కి.మీకి రూ.13 ఖర్చు అవుతుందన్నారు.. అదే ఎలక్ట్రికల్ బస్సులకైతే రూ.3లు మాత్రమే ఖర్చు అవుతుందని తెలిపారు. ప్రస్తుతానికి 350 బస్సులు కేంద్రం ఏపీకి మంజూరు చేసిందన్నారు. ప్రైవేటుగా మరో 650 బస్సులు హైయర్ చేయబోతున్నామన్నారు. ఇందులో అనవసరమైన ఆరోపణలు అక్కర్లేదని సూచించారు. ఎలక్ట్రికల్ బస్సులపై నిపుణుల కమిటీతో చర్చించి నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. మిగిలిన రాష్ట్రాల్లో ధరలను బట్టి ఓపెన్ టెండర్స్‌కి వెళ్తామన్నారు. లీజ్ పద్ధతిలో తీసుకోవడానికి ఈ టెండర్స్ పెడుతున్నట్లు వెల్లడించారు. 12 సంవత్సరాలకు లీజుకు తీసుకుంటామన్నారు. విశాఖ, కాకినాడ, విజయవాడ, గుంటూరు, తిరుపతి రూట్స్‌లో ఈ బస్సులు తిరగబోతున్నాయన్నారు. ఈ ఏడాది 1000 ఎలక్ట్రికల్ బస్సులు తీసుకోవాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఇవి బాగా నడిస్తే మరిన్ని ఎలక్ట్రికల్ బస్సులు తీసుకొస్తామని చెప్పుకొచ్చారు. దసరా సందర్భంగా 1800 స్పెషల్ సర్వీస్‌లు నడపబోతున్నట్లు ప్రకటించారు. 1300 బస్సులు హైదరబాద్ నుంచి... 300 బస్సులు బెంగళూరు నుంచి నడపబోతున్నట్లు వెల్లడించారు.

# డబుల్ డెక్కర్ రైలును ప్రారంభించిన రైల్వే మంత్రి

విశాఖపట్నం, సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ) : ప్రయాణకాలాన్ని తగ్గించడమే కాకుండా, ఎక్కువమంది

ప్రయాణించేలా రూపొందించిన గురువారం ఉదయ్ డబుల్ డెక్కర్ రైలు పట్టాలెక్కింది. విశాఖ నుంచి విజయవాడకు నడిచే డబుల్ డెక్కర్ ఏసీ రైలును రైల్వే సహాయ మంత్రి సురేష్ చన్నబసప్ప అంగడి అధికారికంగా ప్రారంభించారు. ఉదయం 11.30 గంటలకు విశాఖ రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ఎ÷-లాట్‌ఫాంపై రైలుకు పచ్చజెండా ఊపి ఆరంభించారు. గురువారం ఒక రోజు స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌గా ఇది నడుస్తుంది. శుక్రవారం నుంచి రెగ్యులర్ రైలుగా వారానికి ఐదురోజులు (ఆది, గురువారం తప్ప) పరుగులు తీయనుంది. ఎన్నో ప్రత్యేకతలతో ప్రారంభమైన ఉదయ్ రైలుకు విశాఖ నుంచి విజయవాడకు టిక్కెట్ ధర 525 రూపాయిలగా నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు ఎంవివి సత్యనారాయణ, గొట్టేడి మాధవి, జీవీఎల్ నర్సింహారావు, రఘురామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ టిడిపి ఎమ్మెల్యే చింతమనేని రిమాండ్ పొడిగింపు

ఏలూరు, సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ) : ఒక వ్యక్తిని అక్రమంగా నిర్బంధించి, కులంపేరుతో దూషించినందుకు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో జైల్లో ఉన్న టిడిపి మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కు రిమాండ్ ను పొడిగించారు. ఈ కేసు విచారణ సందర్భంగా పోలీసులు ఆయన్ని ఏలూరులోని న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. వచ్చే నెల 9 వరకూ రిమాండ్ ను పొడిగిస్తున్నట్టు కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, 2017లో ఒక స్థల వివాదంలో వ్యక్తిని నిర్బంధించి, కులం పేరుతో ఆ వ్యక్తిని దూషించారన్న ఆరోపణలపై చింతమనేనిపై ఈ కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి చింతమనేని దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ పై కూడా విచారణ జరిగింది.

# ఉత్తరాంధ్ర, రాయలసీమకు భారీ వర్ష సూచన

అమరావతి, సెప్టంబర్27 (ఆర్ఎన్ఎ): ఉత్తరాంధ్ర, రాయలసీమలో ఇవాళ భారీ వర్షాలు కురుసే అవకాశం ఉంది. రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) ఈ విషయం స్పష్టంచేసింది. చిత్తూరు, కర్నూలు, అనంతపురం జిల్లాలోని కొన్ని ప్రాంతాలు, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని తెలిపింది. ఉత్తరాంధ్ర, రాయలసీమ, ఇతర జిల్లాల్లో ఒక మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. 27వ తేదీ ఉత్తరాంధ్ర జిల్లాలు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు, కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల్లో ఒక మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురుస్తాయని పేర్కొంది. 28వ తేదీ ఉత్తరాంధ్ర జిల్లాలు, తూర్పు, పశ్చిమ గోదావరి, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో ఒక మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే చాన్సు ఉందని చెప్పింది. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని తెలిపింది

# నాగార్జునరెడ్డిపై దాడితో.. నాకెలాంటి సంబంధంలేదు

**- ఆయన గత ఎన్నికల్లో టీడీపీ ఏజెంట్‌గా పనిచేశాడు**

**- వైసీపీ నేత ఆమంచి కృష్ణమోహన్‌రెడ్డి**

అమరావతి, సెప్టెంబర్27 (ఆర్ఎన్ఎ) : నాగార్జునరెడ్డిపై దాడితో నాకెలాంటి సంబంధం లేదని, ఆయన గురించి చంద్రబాబు నాయుడు డీజీపీకి లేఖ రాయడం చంద్రబాబు దిగజారుడుతనానికి నిదర్శనమని వైసీపీ కాంగ్రెస్ పార్టీ నేత ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... నాగార్జున రెడ్డిపై దాడితో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. నాగార్జున అనే వ్యక్తి జర్నలిస్ట్ కాదని.. ఆయన గత ఎన్నికల్లో టీడీపీ ఏజెంట్‌గా పనిచేశారని పేర్కొన్నారు. ఈ క్రమంలో తన, తన కుటుంబం గురించి నాగార్జున ఫేస్‌బుక్‌లో తప్పుడు తప్పుడు రాతలు రాశారని ఆరోపించారు.

ఐఏఎస్ అధికారులనుసైతం లుచ్చా, కొజ్జా అని పేర్కొంటూ రాసిన ఘనత అతడికే చెల్లిందన్నారు. చంద్ర బాబు చచ్చిపోయిన విష సర్పం వంటి వాడని... తన చేతిలో మీడియా ఉందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. నాగార్జున గురించి తాను చెప్పిన వాస్తవాలు తన అనుకూల పత్రికల్లో రాయగలరా అని ప్రశ్నించారు. నాగార్జున సూడో నక్సలైట్ పేరుతో వసూళ్లకు పాల్పడ్డాడని, భార్యను వేధించిన ఘటనలో అతడిపై కేసు నమోదు అయిందన్నారు. గతంలో మహిళా ఉద్యోగుల గురించి చెప్పరాని భాషలో తప్పుడు కథనాలు రాశాడని, అంతేకాదు ఓ అమ్మాయిపై అత్యాచారానికి పాల్పడ్డాడన్న కేసు కూడా అతడిపై ఉందన్నారు. గత ఎన్నికల్లో టీడీపీ ఏజెంట్‌గా పనిచేసిన నాగార్జున.. టీడీపీ ఎమ్మెల్యే కరణం బలరాంకు అత్యంత సన్నిహితుడుగా మెలుగుతున్నాడని, నాగార్జునపై మొత్తం 17 క్రిమినల్ కేసులు ఉన్నాయని ఆమంచి కృష్ణమోహన్ పేర్కొన్నారు.

# జగన్‌ను కలిసిన ఫ్రెంచ్ పారిశ్రామికవేత్తలు

అమరావతి, సెప్టంబర్27 (ఆర్ఎన్ఎ): ఇవాళ ఉదయం ఫ్రెంచ్ పారిశ్రామికవేత్తలు సీఎం జగన్‌ను కలిశారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఫ్రెంచ్ బృందం రాష్ట్రానికి వచ్చింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు బృందం వచ్చింది.

పెట్టుబడుల అనుకూలతను ఫ్రెంచ్ బృందానికి మంత్రులు వివరించారు. డైయిరీ, ఆటోమొబైల్, ఎలక్ట్రిక్ గ్రిడ్, ఆటోమేషన్, ఫుడ్‌ప్రాసెసింగ్ రంగాల్లో ఆసక్తి కనబరిచారు. పెట్టుబడులపై ఫ్రెంచ్ పారిశ్రామికవేత్తలు సీఎంతో చర్చించారు.

# ఇంద్రకీలాద్రిపై ప్రమాదం

**పాత గోపురంపై నుంచి జారిపడి కార్మికుడి మృతి**

విజయవాడ, సెప్టంబర్27 (ఆర్ఎన్ఎ): ఇంద్రకీలాద్రి పాతగోపురం పునర్ నిర్మాణంలో భాగంగా ఓ కార్మికుడు గోపురంపై నుంచి జారిపడి మృతి చెందాడు. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఘటన జరిగిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.. మృతుడిని పశ్చిమ బెంగాల్‌కు చెందిన జయదీప్‌గా గుర్తించారు. రక్తపు మరకలు శుభ్రం చేయకుండా ఆలయ అధికారులు ఇసుక వేశారు. దీంతో భక్తులు రక్తపు మరకలను తొక్కుకుంటూ ఆలయంలోకి వెళుతున్నారు.

# జగన్.. స్టిక్కర్ సీఎం కావొద్దు!

**- రైతు భరోసా పథకానికి మోదీ పేరు పెట్టండి**

**- ట్విటర్‌లో జగన్‌కు సూచించిన బీజేపీ ఏపీ అధ్యక్షుడు కన్నా**

అమరావతి, సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ) : గత సీఎం చంద్రబాబు నాయుడులా.. ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి స్టిక్కర్ సీఎం కావొద్దని, రైతు భరోసా పథకానికి మోదీ పేరు పెట్టాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ సూచించారు. గురువారం ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. జగన్ సర్కారు అక్టోబర్ 15నుంచి రైతు భరోసా పథకాన్ని ప్రారంభిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ పథకంలో భాగంగా రాష్ట్రంలోని ప్రతి రైతు కుటుంబానికి ఏటా రూ.12,500 పెట్టుబడి సాయం అందజేయనున్నారు. కౌలు రైతులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు. ఈ పథకానికి వైఎస్ఆర్ రైతు భరోసాగా నామకరణం చేశారు. రైతుపక్షపాతిగా పేరొందిన వైఎస్ పేరును ఈ పథకానికి పెట్టడం సరైందేనని అధికార పార్టీ నేతలు భావిస్తున్నారు. కానీ బీజేపీ మాత్రం ఈ పథకానికి మోదీ పేరు పెట్టాలని డిమాండ్ చేస్తోంది.

ఈ సందర్భంగా కన్నా ట్విటర్‌లో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జగన్ మీరు మరో స్టిక్కర్ సీఎం కాకండి.. మ్యానిఫెస్టోలో మీరు రైతులకు రూ.12500 ఇస్తానని ప్రకటించారు. కానీ నేడు మోదీ రైతులకు ఇచ్చే రూ.6000 లను కలుపుకుని 'వైఎస్సార్ రైతు భరోసా'గా కేంద్రం రైతులకు ఇచ్చేదానిపై బాబు లాగా మీరు స్టిక్కర్ వేయడం తప్పు అన్నారు. రైతు భరోసాకు మోదీ పేరు పెట్టాలని ఆయన ట్వీట్ చేశారు. గతంలో చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వ పథకాలకు పేరు మార్చి.. తన పథకాలుగా ప్రచారం చేసుకున్నారని కన్నా విమర్శించారు. ఎన్నికల ముందు ప్రధాని మోదీసైతం టీడీపీ అధినేతను స్టిక్కర్ బాబు అని ఎద్దేవా చేశారని, రైతులకు కేంద్రం ఏటా రూ.6 వేల సాయం అందిస్తోందని, ఇక మీరు అదనంగా ఇచ్చేది మరో రూ.6500 మాత్రమే అని అన్నారు. కాబట్టి ఈ పథకానికి మోదీ పేరు పెట్టాలని కన్నా సూచించారు. ఇదిలా ఉంటే రైతు భరోసాలో కేంద్రం వాటా కంటే రాష్ట్రం వాటా ఎక్కువైనప్పటికీ కన్నా మాత్రం మోదీ పేరు పెట్టాలని డిమాండ్ చేస్తుండటం గమనార్హం. అయినా కేంద్రం ప్రవేశపెట్టే పథకాలకే మోదీ అనే వాడకుండా.. ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ యోజన, ఆయుష్మాన్ భారత్ యోజన అని పేర్లు పెడుతున్నారు. మరి రాష్ట్రంలో మాత్రం మోదీ అనే పేరు పెట్టాలనుకోవడం ఏంటో బీజేపీ నేతలకే తెలియాలని వైసీపీ నేతలు అంటున్నారు.

# రుణమాఫీ హామీ మాదికాదు.. టీడీపీది!

**- హామీలు ఇచ్చి నిలబెట్టుకోకుండా.. జగన్‌పై నిందలా?**

**- ప్రజలు గుణపాఠం చెప్పినా టీడీపీకి బుద్ధిరాలేదు**

**- రివర్సింగ్ టెండరింగ్ విధానంలో ప్రజాధనం ఎంతో మిగిలింది**

**- వైసీపీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు**

అమరావతి, సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ) : రుణమాఫీ చేస్తామనే హామీ టీడీపీది.. తమది కాదని, హామీ ఇచ్చిన అమలు చేయకుండా ఇప్పుడు జగన్‌పై టీడీపీ నేతలు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని వైసీపీ ఎమ్మెల్యే అంబటి రాంబాబు అన్నారు. గురువారం అంబటి విలేకరులతో మాట్లాడారు.. రుణమాఫీ ఆర్థిక భారమని ధైర్యంగా చెప్పిన వ్యక్తి జగన్ అని తెలిపారు. ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పినా టీడీపీకి బుద్ధి రాలేదని విమర్శించారు. హామీలు ఇచ్చి నిలబెట్టుకోనిది టీడీపీ ప్రభుత్వానిదన్నారు. రూ. 87 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని చెప్పి..రూ. 24 వేల కోట్లు రద్దు చేస్తామన్నారని, అయినా..అవన్నా రద్దు చేశారా అంటే లేదన్నారు. కేవలం రూ.15 వేలు రద్దు చేసినట్లుగా చెప్పారన్నారు. ఇంకా మిగిలిన రుణమాఫీ డబ్బును వైసీపీ ప్రభుత్వం తీర్చాల్సిందేనంటున్నారని తెలిపారు. ప్రజాధనాన్ని ఆదా చేసేందుకు ప్రభుత్వ చర్యలను సమర్థించాల్సింది పోయి.. చంద్రబాబు విషం కక్కుతున్నారని అన్నారు. రివర్సింగ్ టెండరింగ్ విధానంలో ప్రజాధనం ఎంతో మిగిలిందని గుర్తుచేశారు. ఏ ప్రభుత్వం అయినా చేసిందా అని ప్రశ్నించారు. పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ విషయంలో కూడా రాద్ధాంతం చేస్తున్నారని అంబటి విమర్శించారు. సంవత్సరానికి రూ.2వేల500 కోట్లు దుర్వినియోగం అయ్యేవిధంగా చేసుకుని పీపీఏ అగ్రిమెంట్లు చేసుకుని, జల్సా చేస్తున్న తండ్రి, కొడుకులకు బుద్ధిచెప్పే కార్యక్రమమన్నారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ప్రభుత్వం ముందుకెళుతుందన్నారు. సచివాలయాల పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తే..లీకులు..అంటూ ఏవో విమర్శలు చేస్తున్నారని వైసీపీ ఎమ్మెల్యే అంబటి విమర్శించారు. ఇప్పటికైన టీడీపీ నేతలు తమ తీరుమార్చుకోవాలని, లేకుంటే వచ్చేసారికి ఈపాటి సీట్లుకూడా రాకుండా చేస్తారని విమర్శించారు.

# దశలవారిగా ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెడతాం

**- ఆర్టీసీ ఎండీగా బాధ్యతలు స్వీకరించిన కృష్ణబాబు**

అమరావతి, సెప్టెంబర్ 27(ఆర్ఎన్ఎ) : రాష్ట్రంలో దశలవారీగా ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెడతామని ఆర్టీసీ ఎండీ ఎం.టి. కృష్ణబాబు అన్నారు. గురువారం ఆర్టీసీ ఇన్‌ఛార్జి వైస్ ఛైర్మన్, ఎండీగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఎం.టి.కృష్ణబాబు మాట్లాడారు.. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని అన్నారు. ఎలాంటి అనుమానాలు, అపోహలు అవసరం లేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు అందుతాయన్నారు. జనవరి నుంచి అందించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. 2015 నుంచి డీజిల్ ధరలో పెరుగుదలతో ఆర్థికంగా భారం పడుతోందన్నారు. డీజిల్ భారం తగ్గించేందుకు ఎలక్ట్రిక్ బస్సులను దశల వారీగా ప్రవేశపెట్టబోతున్నామని వెల్లడించారు. కేంద్రం రాయితీతో మొదటి విడతగా 350 బస్సులు తెచ్చేందుకు టెండర్లు పిలుస్తామన్నారు. వాటికి అదనంగా మరో 650 ఎలక్ట్రిక్ బస్సులను వినియోగిస్తామన్నారు. డ్రైవర్ మినహా నిర్వహణ, సిబ్బంది బాధ్యత మొత్తం టెండర్‌దారునిదేనన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తే రూ.3300 కోట్లు ఆర్టీసీకి మిగులుతుందని ఎండీ కృష్ణబాబు తెలిపారు. ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగుల విలీన పక్రియ జనవరి 1కి పూర్తయ్యేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఆర్టీసీకి నెలకు 100 కోట్లు నష్టం వస్తుందన్నారు. 2015 నుండి డీజిల్, జీతభత్యాలు పెరగడం వల్ల నష్టాలు వస్తున్నాయని వివరించారు. అందుకోసమే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఉద్యోగులను విలీనం చేస్తే 3300 కోట్లు ఆర్టీసీకి మిగులుతుందన్నారు.

# సుబాబుల రైతులకు న్యాయం చేస్తాం

**- టీడీపీ హయాంలో అభివృద్ధి కుంటుపడింది**

**- రవాణాశాఖ మంత్రి పేర్నినాని**

విజయవాడ, సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ) : సబాబుల రైతుల సమస్యల పరిష్కారంకు తనవంతు కృషి చేస్తానని రవాణాశాఖ మంత్రి పేర్ని నాని అన్నారు. గురువారం చందర్లపాడు మండలం కొనాయపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన దివంగత నేత వంగవీటి మోహన్ రంగా విగ్రహాన్ని శాసనసభ్యులు మొండితోక జగన్మోహనరావు, ,సామినేని ఉదయభాను, వసంత కష్ట ప్రసాద్ లతో కలిసి ఆవిష్కరించారు. అంతకు ముందుగా గ్రామంలోని మహానేత రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి పేర్నినాని మాట్లాడుతూ.. ఐదేళ్లు మంత్రిగా ఉండి కూడా తన ప్రాంత సుబాబుల రైతులకు న్యాయం చేయలేని మాజీ మంత్రి వినేని ఉమామహేశ్వరరావు రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నాయకులు పై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. అయిదేళ్లు మంత్రిగా ఉండి సుబాబుల రైతులకు ఏం చేశారో చెప్పాలని దేవినేనిని డిమాండ్ చేశారు? శాసనసభ్యుడు.జగన్ మోహన్ రావు మాట్లాడుతూ.. చంద్రబాబు పాలన పుణ్యమాని రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని పేర్కొన్నారు, ఇచ్చిన ప్రతి ఒక్క హామిని అమలు చేసేలా ముఖ్యమంత్రి జగన్ కృషి చేస్తున్నారన్నారు, రాష్ట్రం అప్పులో ఊబిలో ఉందని ఆయన ఉన్నంతకాలం ఓవర్డ్రాఫ్ట్‌లతోనే కాలం గడిపారన్నారు ,కానీ జగన్మోహన్ రెడ్డి మాత్రం అన్ని కష్టాల్లో బాధ్యతలు చేపట్టినప్పటి ఒక్కపైసా అప్పు చేయకుండా క్రమశిక్షణతో పాలన సాగిస్తున్నారని తెలిపారు

# భూ రికార్డుల్లో లోపాలవల్లే కబ్జాలు

**- అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి**

**- ఏపీ డిప్యూటీసీఎం పిల్లి సుభాష్ చంద్రబోస్**

కడప, సెప్టెంబర్27(ఆంఎన్ఎ) : రాష్ట్రంలో భూ రికార్డులు అస్తవ్యస్తంగా ఉన్నాయని, భూ రికార్డులు సరిగా లేకపోవడం వల్లనే చాలా ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని ఏపీ డిప్యూటీ సీఎం పిల్లి సుభాష్ చంద్రబోస్ అన్నారు. గురువారం కడప కలెక్టరేట్‌లో 'నవరత్నాలు-పేదలందరికీ ఇళు' అనే అంశంపై సమీక్ష నిర్వహించారు. సమావేశానికి ఉప ముఖ్యమంత్రులు పిల్లి శుభాష్ చంద్రబోస్, అంజద్ బాషా, ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, గృహ నిర్మాణశాఖ మంత్రి రంగనాథరాజు, ఎంపీ అవినాశ్ రెడ్డి, కడప జిల్లా వైకాపా ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ పరిపాలన సక్రమంగా జరగాలంటే అధికారులంతా చిత్తుశుద్ధితో పని చేయాలని చంద్రబోస్ అన్నారు. కబ్జాల్లో ఉన్న ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని ఆయన తెలిపారు. ఉగాది నాటికి రాష్ట్రంలోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఉన్నారని, ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు అధికారులు కసరత్తు ముమ్మరం చేయాలని చంద్రబోస్ కోరారు. కడప జిల్లాలో పేదలకు ఇవ్వడానికి అవసరమైన ప్రభుత్వ భూమిని సేకరించినట్లు అధికారులు చెప్పడం శుభపరిణామమన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు మేలు జరిగేలా జగన్ పాలన సాగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రజలంతా సంతోషంగా ఉన్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కొన్ని వర్గాలకే పాలన ఫలాలు అందాయని, ఇప్పుడు పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. అర్హులైన వారు ఎవరైనా ప్రభుత్వ ఫలాల కోసం దరఖాస్తులు చేసుకుంటే వారికి వెంటనే పథకాల ఫలాలు అందేలా చూడాలని అధికారులకు సూచించారు.

# పవన్‌కు తీవ్ర వెన్నునొప్పి

**- సర్జరీ చేయాలన్న వైద్యులు**

అమరావతి, సెప్టెంబర్27 (ఆర్ఎన్ఎ) : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వెన్నెముక నొప్పితో బాధపడుతున్నారని జనసేన కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. వెన్నెముక నొప్పికి సంబంధించి ట్రీట్మెంట్ తీసుకుంటున్నట్లు పవన్ ఆ ప్రకటనలో తెలియజేశారు. విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి, ఆ సమావేశానికి నన్ను ఆహ్వానించినందుకు కృతజ్ఞతలంటూ ఆ ప్రకటనలో తెలిపారు. మీడియా స్వేచ్ఛ కోసం మీరు చేస్తున్న పోరాటానికి జనసేన తరఫున, వ్యక్తిగతంగా నా తరఫున సంపూర్ణ మద్దతును తెలియచేస్తున్నానన్నారు. అయితే ఆరోగ్యం సహకరించకపోవడం వల్ల నేను ఈ సమావేశానికి హాజరు కాలేకపోతున్నానని అన్నారు. 'గబ్బర్ సింగ్ సినిమా షూటింగ్ సమయంలో వెన్ను పూసలకు తీవ్ర గాయాలు కావడంతో తరచూ నన్ను వెన్ను నొప్పి బాధిస్తోందని, ఇటీవల కాలంలో ఎన్నికల ప్రచార సమయంలో అశ్రద్ధ చేయడంవల్ల గాయాల నొప్పి తీవ్రత పెరిగిందన్నారు. డాక్టర్లు సర్జరీకి వెళ్ళమని సలహా ఇచ్చినప్పటికీ సంప్రదాయ వైద్యం పై నమ్మకంతో ఆ దిశగానే ముందుకు వెళుతున్నానని, గత కొన్ని రోజులుగా మళ్ళీ బ్యాక్ పెయిన్ తీవ్రంగా ఇబ్బంది పెడుతోందని, ట్రీట్మెంట్ తీసుకుం టున్నానంటూ ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగానే గత మూడు రోజులుగా ఎటువంటి కార్యక్రమాలలో పాల్గొనడం లేదని, అయితే జనసేన తరఫు నుంచి పార్టీ ప్రతినిధులు మీరు నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారని, ఈ సమావేశం విజయవంతం కావాలని పవన్ ఆ ప్రకటనలో ఆకాంక్షించారు.

## ఏపీ వార్తలు

## పర్యావరణ విధ్వంసాన్ని..

# ఎట్టిపరిస్థితుల్లో సహించేదిలేదు

**- గోదావరి జిల్లాల్లో పంటకాల్వల పరిరక్షణకు 'మిషన్ గోదావరి'**

**- ఇ-వ్యర్థాల కోసం ప్రత్యేక కాల్‌సెంటర్**

**- చెట్లను పెంచడంలో గ్రామ వాలంటీర్ల సహకారం తీసుకోవాలి**

**- ప్రతి ఇంటికి నాలుగు మొక్కలు ఇవ్వాలి**

**- సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేదించాలి**

**- అటవీ, పర్యావరణ శాఖలపై సమీక్షలో ఏపీ సీఎం జగన్**

అమరావతి,సెప్టెంబర్27 (ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో పర్యావరణ విధ్వంసాన్ని ఎట్టిపరిస్థితుల్లో సహించేది లేదని ఏపీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అన్నారు. అమరావతిలోని సచివాలయంలో గురువారం అటవీ, పర్యావరణ శాఖలపై జగన్ సమీక్ష నిర్వహించారు. కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణపై సమీక్షలో పాల్గొన్న అధికారులకు జగన్ కీలక ఆదేశాలు జారీ చేశారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ని పూర్తిగా నిషేధించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. పరిశ్రమల కాలుష్యాన్ని తొలగించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.

అంతేకాకుండా పరిశ్రమల కాలుష్య నియంత్రణకు హరిత పన్నును ప్రవేశపెడతామని చెప్పారు. ప్రస్తుత కాలుష్య నియంత్రణ బోర్డు, సంబంధిత వ్యవస్థల్లో ప్రక్షాళన దిశగా చర్యలు తీసుకుంటామని వివరించారు. కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలిచేలా ప్రణాళికలు చేయాలని అధికారులకు సూచించారు. కాలుష్య నియంత్రణకు అత్యుత్తమ విధానాలపై ప్రతిపాదనలు, అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టనున్నట్లు జగన్ చెప్పారు. విశాఖ కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. గోదావరి జిల్లాల్లో పంటకాల్వల పరిరక్షణకు 'మిషన్ గోదావరి'ని ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. ఇ-వ్యర్థాల కోసం ప్రత్యేక కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అంతేగాక విశాఖపట్నం కాలుష్యంతో అల్లాడుతోందని, కాలుష్యనియంత్రణ చేయకపోతే తీవ్ర ఇబ్బందులు తప్పవని అధికారులను సీఎం జగన్ హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణకు, విశాఖ నగరంలో కాలుష్య నియంత్రణకు పెద్దపీట వేయాలని ఆదేశించారు. వేస్ట్ మేనేజ్‌మెంట్, మురుగునీటి పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. మురుగునీటిని శుద్ధిచేసిన తర్వాతే విడిచిపెట్టాలని, సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్‌పై ఫ్రెంచి ప్రతినిధి బృందంతో తాను చర్చించినట్లు సీఎం తెలిపారు. పంట కాల్వలను కాపాడుకోవాలని, అవి కాలుష్యం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ వాలంటీర్లందరికీ మొక్కలు పంపిణీ చేయాలని, చెట్లను పెంచడంలో అధికారులు వారి సహకారం తీసుకోవాలని సీఎం జగన్ సూచించారు. ప్రతి ఇంటికీ నాలుగు మొక్కలు ఇవ్వాలని, కాల్వ గట్లమీద మొక్కలను వీలైనంత పెంచాలని వివరించారు. అనంతపురం, కడప ప్రాంతాల్లో అడవులను పెంచడానికి దృష్టిపెట్టాలని, ఆ ప్రాంత ప్రస్తుత నైసర్గిక స్వరూపాన్ని మార్చాలని ఆదేశించారు. అటవీశాఖ వద్ద ఉన్న ఎర్రచందనాన్ని ఏక మొత్తంగా అమ్మే పద్దతులు కాకుండా విడతల వారీగా అమ్మితే ప్రభుత్వానికి మేలు జరుగుతుందని అన్నారు. ఈ విషయంలో అంతర్జాతీయ సంస్థల సహకారం తీసుకుంటే మంచిదని, చైనా, జపాన్ సంస్థలతో చర్చలు జరపాలని అధికారులకు సీఎం జగన్ సూచించారు. ఈ సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్, పర్యావరణశాఖ మంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి, అటవీ, పర్యావరణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర విధానాలపై వామపక్షాల ఉద్యమం

## 10 నుంచి 16 వరకు దేశవ్యాప్త ఆందోళన: చాడ

కరీంనగర్,సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం ఆర్థిక దివాలాకోరు విధానాలను నిరసిస్తూ అక్టోబర్ 10 నుంచి 16 వరకు దేశవ్యాప్తంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్ రెడ్డి తెలిపారు. అక్టోబర్ 2 నుంచి మాసాంతం వరకు బీజేపీ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ప్రజా చైతన్య కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కశ్మీర్ విషయంలో ప్రధాని ఎమర్జెన్సీని తలపించేలా ప్రవర్తించారని, దేశంలో మతోన్మాదం పెరిగిపోతుందని విమర్శించారు. దేశంలోని ప్రజలకు స్వేచ్ఛ లేకుండా పోయిందన్నారు. ఆర్థికమాంద్యంతో ఉపాధి హామీ పథకానికి నిధుల కేటాయింపు జరగడం లేదని, కార్మికుల హక్కులపై కేంద్రం దాడి చేస్తుందని మండిపడ్డారు. కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఈనెల 24న కోల్ ఇండియా కార్మికులు ఎనిమిది లక్షలమంది సమ్మె నిర్వహించారని గుర్తు చేశారు. స్వామినాథన్ కమిషన్ అమలు కాకపోవడంతో రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. దుబారా ఖర్చులను తగ్గించి ఉత్పత్తి రంగాలపై దృష్టి పెట్టాలని సీపీఐ కోరుతుందని అన్నారు. విష జ్వరాలపై ప్రభుత్వం హెల్త్ ఎమ్మర్జెన్సీ విధించాలని కోరారు. సీఎం కేసీఆర్ ఆలోచన విధానం మారాలని, లేకుంటే తెలంగాణ ఉద్యమం లాగే మరో ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని చాడ వెంకట్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.



వనపర్తిలో విద్యార్థులతో కలసి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మంత్రి నిరంజన్ రెడ్డి.

# మోడీతో భారత్ ప్రతిష్ట పెరుగుతోంది: జీవీఎల్

విశాఖపట్నం,సెప్టెంబర్27 (ఆర్ఎన్ఎ): వంద రోజుల పాలనలో కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అన్నారు. మోడీ పాలనతో దేశం అభివృద్ధిలో పురోగమిస్తోందన్నారు. అలాగే విదేశాల్లో భారత్ పట్ల ఆదరణ పెరుగుతోందని అన్నారు. ప్రపంచమంతా భారతదేశాన్ని విశ్వశక్తిగా.. ప్రధాని నరేంద్ర మోదీని విశ్వనాయకుడిగా గుర్తిస్తోందని అన్నారు. కార్పోరేట్‌లో పన్ను తగ్గింపుతో పెట్టుబడులు వస్తాయని తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పెట్టుబడులు రావటం వల్ల యువతకు ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారు. విశాఖ - చెన్నై పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. విశాఖ అభివృద్ధికి కేంద్రం అన్ని రకాలుగా సహాయం అందిస్తుందని అన్నారు. భారత ప్రభుత్వం తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలను ప్రపంచ దేశాలు మెచ్చుకుంటున్నాయని పేర్కొన్నారు. టీడీపీ సొంత తప్పిదాల వల్లే ఓటమి మూటగట్టుకుందని అన్నారు. పీపీఏల్లో అవినీతి లేదని తాము చెప్పటం లేదని, సూచన మాత్రమే చేశామని తెలిపారు. ఖర్చు తగ్గించి పోలవరం నిర్మిస్తామంటే కేంద్రానికి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు.

# వైసీపీ ఆపరేషన్ ఆకర్ష్!

**- వైకాపాలోకి పంచకర్ల రమేష్‌బాబు?**

అమరావతి, సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ) : టీడీపీ నుంచి వైసీపీలోకి వలసలు పెరుగుతున్నాయి. ఇప్పటికే పలువురు టీడీపీ నేతలు బీజేపీ బాటపట్టగా, ఇప్పుడు వలసలు వైసీపీలో మళ్లాయి. ఇటీవల త్రిమూర్తులతో పాటు పలువురు టీడీపీ నేతలు వైసీపీలో చేరగా ఇప్పుడు తాజాగా మరో సీనియర్ నేత వైసీపీలో చేరుతున్నట్లు ప్రచారం సాగుతుంది. తోట త్రిమూర్తులు వైసీపీ కండువా కప్పుకున్న తర్వాత పరేషన్ ఆమంచి పేరుతో ఎంపీ విజయ సాయిరెడ్డి పెద్ద బాంబు పేల్చారు. తమ పార్టీలోకి వైసీపీ నుంచి చేరికలు ఉండబోతున్నాయని సంకేతాలు ఇచ్చారు. భవిష్యత్‌లో టీడీపీ కనిపించదని వ్యాఖ్యానించారు. ఆపరేషన్ ఆమంచి ప్రకటించి మూడు వారాలు కూడా కాకముందే మళ్లీ టీడీపీలో కలవరం మొదలయ్యింది. పార్టీకి చెందిన మరో ముఖ్య నేత వైసీపీలోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారనే ప్రచారం జరుగుతోంది. ఉత్తరాంధ్రలోని విశాఖ జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే, కీలక నేత పంచకర్ల రమేష్‌బాబు టీడీపీకి గుడ్ బై చెప్పేందుకు సిద్ధమైనట్లు టాక్ నడుస్తోంది. ఆయన అధికార పార్టీలోకి వెళ్లడం దాదాపు ఖాయమైందని తెలుస్తోంది. ఇప్పటికే విజయసాయిరెడ్డితో చర్చలు జరిపినట్లు సమాచారం. ఆపరేషన్ ఆమంచిలో భాగంగా పంచకర్ల వైసీపీలోకి వెళుతున్నారనే ఉత్తరాంధ్ర ప్రచారం సాగుతుంది. వైసీపీ అధిష్టానం, జగన్ నుంచి పంచకర్లకు గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు తెలుస్తోంది. దసరా సమయంలో పార్టీలో చేరేందుకు ముహూర్తం కూడా ఫిక్స్ చేసుకున్నట్లు విశాఖ జిల్లాలో ప్రచారం జరుగుతోంది. పార్టీ మార్పుపై ఇప్పటికే పంచకర్ల తన అనుచరులకు కూడా సంకేతాలు ఇచ్చేశారని సమాచారం. దీనికి తోడు టీడీపీ కార్యక్రమాలకు దూరంగా ఉండటంతో రమేష్ పార్టీ మారబోతున్నారని చర్చ జరిగింది. తాజా పరిణామాలను గమనిస్తే అవే సంకేతాలు కనిపిస్తున్నాయని తెలుస్తుంది. పంచకర్ల రమేష్ ప్రజారాజ్యం పార్టీతో పొలిటికల్ ఎంట్రీ ఇచ్చారు. 2009లో విశాఖ జిల్లా పెందుర్తి నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలిచారు. తర్వాత ప్రజారాజ్యం కాంగ్రెస్‌లో విలీనం కావడం.. తర్వాత రాష్ట్ర విభజన జరగడంతో.. మారిన పరిణామాలతో గంటా శ్రీనివాసరావు, అవంతి శ్రీనివాస్‌తో కలిసి టీడీపీలో చేశారు. తర్వాత 2014లో యలమంచిలి నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలిచారు. మళ్లీ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో యలమంచిలి నుంచి మళ్లీ పోటీచేసి వైసీపీ అభ్యర్థి కన్నబాబురాజు చేతిలో ఓడిపోయారు. ఎన్నికల ఫలితాల తర్వాత టీడీపీ రూరల్ అధ్యక్షుడి పదవికి రాజీనమా చేశారు. తర్వాత పార్టీ కార్యక్రమాలతో కూడా అంటీముట్టనట్లు ఉంటున్నారు. అలాగే కాపునేతలందరూ కలిసి సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం.. తర్వాత పరిణమాలతో రమేష్ బీజేపీలోకి వెళతారనే ప్రచారం జరిగింది. అయితే ఆయన మాత్రం ఈ ప్రచారాన్ని కొట్టిపారేశారు.. మళ్లీ ఇప్పుడు వైసీపీలోకి వెళ్లబోతున్నారని ప్రచారం నడుస్తోంది.

# బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న మంత్రి నిరంజన్

వనపర్తి,సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ): జిల్లా కేంద్రం వనపర్తిలోని శ్రీ వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖామంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి ఆయన బతుకమ్మ పాటలు పాడుతూ, చిందులేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బతుకునిచ్చే బతుకమ్మ మన రాష్ట్ర సాంప్రదాయ పండుగ. ఏడాదికోసారి మనం ఎంతో ఉత్సాహంగా జరుపుకునే ఈ పండుగను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం మన అదృష్టమని మంత్రి అన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లోనూ అందరూ పాల్గొని, పండుగను ఘనంగా జరుపుకోవాలన్నారు. సాంప్రదాయ పండగలను మర్చిపోకూడదని ఆయన ఈ సందర్భంగా అన్నారు. అనంతరం మంత్రి జిల్లా కేంద్రంలోని బాలుర డిగ్రీ కళాశాలలో అదనపు గదులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానంతరం, మంత్రి వేంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళా ప్రదర్శన కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి నిరంజన్ రెడ్డితో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైల్వేకు భూకేటాయింపుల్లో అలసత్వం

**-ప్రభుత్వంపై కిషన్ రెడ్డి మండిపాటు**

హైదరాబాద్,సెప్టెంబర్27 (ఆర్ఎన్ఎ): చర్లపల్లి రైల్వే టర్మినల్ పనులు వేగవం తమవుతున్నాయని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. 150 ఎకరాల స్థలంలో టర్మినల్ నిర్మించాలని ప్రతిపాదనలు పెడితే రైల్వేకు రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించలేదని ఆరోపించారు. ప్రధాని మోడీ అనేక కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారని గురువారం నాడిక్కడ మీడియా సమావేశంలో మాట్లాడారు.

ఘట్‌కేసర్-రాయగిరి ఎంఎంటీఎస్ పనులకు రాష్ట్ర ప్రభుత్వం తన వాటా ఇవ్వలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కారణంగానే ఎంఎంటీఎస్-2 పనులు ఆగిపోయాయన్నారు. భద్రాచ లం-కొవ్వూరు, మణుగూ రు-రామగుండం పనులు పెండింగ్‌లో ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం భూములు ఇస్తే రైల్వే పనులు వేగం పుంజుకుంటాయని చెప్పా రు. తెలంగాణ ప్రజలు రైలు ఎక్కరని, బస్సుల్లోనే తిరుగుతారని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇకపోతే కేంద్ర బ్జడెట్‌కు ఆర్థిక క్రమశిక్షణ ఉందని, రాష్ట్ర బ్జడెట్‌కు లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. బీజేపీ వల్లే ఆర్థిక మాంద్యం అని అర్థం వచ్చేలా సీఎం కేసీఆర్ వ్యాఖ్యలు చేస్తున్నారని మండి పడ్డారు. ఇది ఆర్థిక మాంద్యం కాదు... ఆర్థిక మందగమనమని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రారంభోత్సవానికి గిఫ్ట్‌ల కోసం రూ.1.50 కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. అసదుద్దీన్ సాధారణ ఎంపీ అని ట్రంప్‌ను ప్రశ్నించే స్థాయి ఆయనకు లేదన్నారు. అసద్ మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని ఆయన కొట్టిపారే శారు. ఏపీలో ఇల్లీగల్ చర్చిల తొలగింపు రాష్ట్ర పరిధిలోని అంశమన్నారు. దేశంలో రోహింగ్యాల వివరాలు సేకరిస్తున్నామని, తెలం గాణలో 6 వేల మంది రోహింగ్యా లు ఉన్నారని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

# హుజూర్ నగర్ బిజెపి అభ్యర్థిగా కోట రామారావు

**నిర్ణయించిన బిజెపి కార్యవర్గం**

నల్లగొండ,సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ): హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా కోట రామారావును బీజేపీ రాష్ట్ర కార్యవర్గం ఎంపిక చేసింది. టికెట్ రేసులో శ్రీకళారెడ్డి, జిల్లేపల్లి వెంకటేశ్వరరావు, బొబ్బా భాగ్యారెడ్డి, ఎన్ఆర్ఐ కోటా అప్పిరెడ్డి ఉండగా చివరకు రామారావుకు టికెట్ దక్కింది. మొదట శ్రీకళారెడ్డికి టికెట్ ఖరారు అవ్వగా కుటుంబ సభ్యుల ఒత్తిడితో పోటీ నుండి తప్పుకున్నారు. కాగా, టీఆర్ఎస్, కాంగ్రెస్ తమ అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. టీఆర్ఎస్ నుంచి శానంపూడి సైదిరెడ్డి, కాంగ్రెస్ నుంచి పద్మావతిరెడ్డి బరిలోకి దిగుతున్నారు. నామినేషన్లకు ఈనెల 30 వరకూ గడువు ఉంది. అక్టోబరు 21న పోలింగ్ జరిగి, అదే నెల 24న ఫలితాలు విడుదల కానున్నాయి. కాగా, హుజుర్‌నగర్ ఉప ఎన్నిక విజయం ఇప్పుడు మూడు ప్రధాన పార్టీలకు సవాల్‌గా మారింది. హుజూర్‌నగర్‌లో పాగా వేయాలని అధికార టీఆర్ఎస్ పార్టీ గట్టి ప్రయత్నాలు చేస్తోంది. గెలుపు బాధ్యతను సీనియర్ నేత పల్లారాజేశ్వర్ రెడ్డికి అప్పగించింది. సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకుని పట్టు నిలుపుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే ఒక్క స్థానంలో గెలిచిన బీజేపీ హుజూర్‌నగర్‌ను కైవసం చేసుకోవాలని సర్వశక్తులు ఒడ్డుతోంది. మాజీ ఎమ్మెల్యే కుమార్తె, కోదాడ వాసి శ్రీకళారెడ్డి పేరు ముందుగా తెరపైకి వచ్చినా చివరకు రామారావు పేరును ఖరారు చేసింది. శ్రీకళారెడ్డి పోటీ నుంచి తప్పుకున్నట్టు ప్రచారం జరుగుతోంది.

# హామీలను పరిష్కరించండి

**-కేంద్రమంత్రికి రేవంత్ లేఖ**

హైదరాబాద్,సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ): ఏపీ పునర్విభజన చట్టంలోని హామీలను పరిష్కరించాలని రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను ఎంపీ రేవంత్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయనకు లేఖ రాశారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు గతంలో హామీ ఇచ్చారని.. దాన్ని అమలు చేయాలని రేవంత్ విజ్ఞప్తి చేశారు. మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని 21 అంశాలను ఆయన తన లేఖలో ప్రస్తావించారు.

మక్తల్-వికారాబాద్ వయా కొడంగల్ గ్రీన్‌ఫీల్డ్ రైల్వే లైన్.. అల్వాల్, మల్కాజ్‌గిరి, బొల్లారం రైల్వేస్టేషన్లలో అదనపు ప్లాట్ ఫాం నిర్మాణం చేపట్టాలని రేవంత్ కోరారు. మేడ్చల్ రైల్వేస్టేషన్‌లో ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. దక్షిణ మధ్య రైల్వే ఉద్యోగుల క్వార్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయని ఆయన కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రైల్వే ఉద్యోగుల పిల్లలకు మౌలాలి ప్రాంతంలో వైద్యకళాశాల ఏర్పాటు చేయాలని లేఖ ద్వారా కోరారు.

# సబ్ కాంట్రాక్టర్‌కు దుర్గగుడి పనులు

**చర్యలు తీసుకుంటామన్న ఇవో**

విజయవాడ,సెప్టెంబర్27 (ఆర్ఎన్ఎ): కాంట్రాక్ట్ పనులు హైందవేతరులకు ఇవ్వకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని దుర్గగుడి అధికారులు పాటించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సబ్ కాంట్రాక్టర్ షేక్ రబ్బీర్‌కు దసరా ఉత్సవాల పనులు అప్పగించారని తెలుస్తోంది. అయితే దుర్గగుడి ఈవో సురేష్ బాబు మాత్రం లక్ష్మీ నరసింహ షామియానాకు పనులు ఇచ్చామని తెలిపారు. నేడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సదరు కాంట్రాక్టర్ ముస్లిం వ్యక్తికి సబ్ కాంట్రాక్ట్ ఇచ్చాడని.. పోలీసుల ద్వారా తమకు ఇప్పుడే తెలిసిందన్నారు. లక్ష్మీ నరసింహ షామియానా కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెడతామని వెల్లడించారు. దసరా పనుల్లో ప్రమాదవశాత్తు మృతి చెందిన జైదేవ్ కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తామన్నారు. జైదేవ్ కింద పడగానే ఆసుపత్రికి తరలించామని.. అతడు చికిత్స పొందుతూ చనిపోయాడని సురేష్‌బాబు పేర్కొన్నారు. జై దేవ్ కింద పడిన ప్రాంతంలో రక్తపు మరకలను శుద్ధి చేయించామన్నారు. భక్తులు రక్తపు మరకలు తొక్కి దర్శనానికి వెళ్లారనడం అవాస్తవమని ఈవో స్పష్టం చేశారు.

# అతిపెద్ద అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు

హైదరాబాద్,సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ): రాజ్యాంగ నిర్మాత, భారత ప్రభుత్వ మొట్టమొదటి న్యాయశాఖ మంత్రి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ అతిపెద్ద విగ్రహాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్నారు. బోరబండలోని అంబేద్కర్ స్టడీ సర్కిల్ భవనంపై ఈ విగ్రహాన్ని నిర్మిస్తున్నారు. ఈ విగ్రహం ఎత్తు 27.6 అడుగులు. ప్రపంచంలోనే ఎత్తైన అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకు గానూ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు అంబేద్కర్ స్టడీ సర్కిల్ చైర్మన్ మ్లలెపల్లి లక్ష్మయ్యకు సర్టిఫికేట్‌తో పాటు షీల్డ్ అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజనీర్ గణపతి రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మూసీ పరివాహక చెరువులకు జలకళ

## హైదరాబాద్ వర్షాలతో భారీగా వరదనీరు

యాదాద్రి భువనగిరి,సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ): రాజధాని హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షాలతో పాటు నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో కురిసిన వర్షాలతో చెరువులకు జలకళ వచ్చింది. ఇందుకు ప్రధానంగా మూసీ ప్రవాహంతో పరివాహకంలోని చెరువులు నిండడమే కారణం. నల్లగొండ సూర్యాపేట జిల్లాలో నిండుకుండల్లా తొణికిసలాడుతుండగా.. సూర్యాపేటలో అత్యధికంగా చెరువులు 100శాతానికి అతి చేరువలో ఉన్నాయి. సెప్టెంబర్‌లో విస్తారంగా వర్షాలు కురిసినా నేటికీ ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులున్నాయి. ముఖ్యంగా దేవరకొండ, మునుగోడు, తుంగతుర్తి, ఆలేరు నియోజకవర్గాల్లో చెరువులు ఎక్కువ సంఖ్యలో నిండలేదు. అత్యధిక చెరువులు యాదాద్రి జిల్లాలో అలుగులు పోస్తున్నా.. సూర్యాపేట జిల్లాలోనే అత్యధికంగా చెరువుల్లో నీళ్లు చేరాయి. నల్లగొండ జిల్లాలో పరిస్థితి మిగిలిన రెండు జిల్లాల కంటే వెనుకంజలో ఉంది. ఒకటీ రెండు భారీ వర్షాలు వర్షాభావ పరిస్థితులు ఉన్న ప్రాంతాల్లో కురిస్తే పరిస్థితిలో మార్పు వచ్చే అవకాశం కనిపిస్తోంది. తాజాగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోఅనేక చెరువులు పూర్తిస్థాయిలో నిండి అలుగులు దుంకుతున్నాయి. . మూడు జిల్లాల్లో మూసీ నది పరివాహక ప్రాంతంలోనే అత్యధిక చెరువులు జలకళను సంతరించుకోగా.. సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలు ఉమ్మడి జిల్లా అంతటా చెరువులు, కుంటలకు నీటిని భారీగా తీసుకొచ్చాయి. ఫలితంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో అనేక చెరువులు అలుగులు పోస్తున్నాయి. సూర్యాపేట జిల్లాలో అత్యధికంగా చెరువులు నిండాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో వెయ్యి చెరువులు నిండు కుండల్లా తొణికిసలాడుతున్నాయి.

# 'మహా' ఎన్నికలపై కోర్ కమిటీ భేటీ



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27: వచ్చే నెలలో జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి గురువారం ఢిల్లీలో బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా అధ్యక్షతన కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఎన్నికల ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహం, శివసేనతో పొత్తు, అభ్యర్థుల ఖరారు వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. శివసేనతో పొత్తుకు సంబంధించి ప్రతికూల సంకేతాలు వస్తున్న నేపథ్యంలో జరిగిన ఈ సమావేశానికి రాజకీయ ప్రాధాన్యత ఏర్పడింది.

గతంలో కంటే ఈసారి శివసేనకు తక్కువ సీట్లు కేటాయించాలని బీజేపీ భావిస్తున్నట్లుగా వచ్చిన వార్తలు రాజకీయ అలజడి సృష్టించాయి. అయితే, ఈ కథనాల్లో నిజం లేదని, త్వరలోనే శివసేనతో సీట్ల ఒప్పందం కుదురుతుందని బీజేపీ వర్గాలు తెలిపాయి. 288 సీట్లు కలిగిన మహారాష్ట్ర అసెంబ్లీలో శివసేనకు 115 నుంచి 125 సీట్లు దక్కే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. సీట్ల ఒప్పందం కుదుర్చుకోవడంలో భాగంగా శివసేనకు ఉప ముఖ్యమంత్రి పదవి కూడా ఇచ్చేందుకు బీజేపీ సిద్ధం కావచ్చుని కూడా తెలుస్తోంది.

అయితే, దీనిపై నేతల నుంచి ఎలాంటి స్పందన లేదు. ఇంతవరకు ఎలాంటి సీట్ల ఒప్పందం కుదరలేదని.. ఇప్పుడే పదవుల ప్రస్తావన ఎందుకని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. ఈ సమావేశంలో బీజేపీ తాత్కాలిక అధ్యక్షుడు నడ్డా, కేంద్ర మంత్రి గడ్కరీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవిస్ పాల్గొన్నారు.

# ఈడీ ఎదుటకు పవార్ రావాల్సిన అవసరంలేదు

### – పవార్‌కు లేఖరాసిన ఈడీ



ముంబయి, సెప్టెంబర్27 (ఆర్ఎన్ఎ) : మనీ లాండరింగ్ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ) అధినేత శరద్ పవార్ ఈడీ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని దర్యాప్తు సంస్థ వెల్లడించింది. ఈ మేరకు ఈడీ ఆయనకు లేఖ రాసింది. శరద్ పవార్ ఈడీ ఆఫీస్‌కు రావాల్సిన అవసరం లేదని, భవిష్యత్‌లో అవసరమైతే తామే విచారణకు పిలుస్తామని లేఖలో పేర్కొంది. మహారాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంక్‌లో రూ. 25వేల కోట్ల కుంభకోణానికి సంబంధించి నగదు అక్రమ చలామణీకి పాల్పడ్డారన్న అభియోగాలపై శరద్‌పవార్‌పై ఈడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ కేసులో పవార్‌కు ఈడీ ఎలాంటి సమన్లు జారీ చేయలేదు. అయినప్పటికీ శుక్రవారం తాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఎదుట హాజరవుతానని పవార్ గురువారం వెల్లడించారు. అయితే ఆయన రావాల్సిన అవసరం లేదని ఈడీ తాజాగా స్పష్టం చేసింది. అటు ముంబయి పోలీసు కమిషనర్ కూడా పవార్‌ను కలిసి ఈడీ కార్యాలయానికి వెళ్లొద్దని కోరినట్లు ఎన్‌సీపీ నేతలు తెలిపారు. శరద్‌పవార్‌పై ఈడీ కేసు నమోదు చేయడంతో ఆ పార్టీ కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టారు. మరోవైపు ఈడీ కార్యాలయానికి సమీపంలోనే ఎన్‌సీపీ పార్టీ ఆఫీస్ ఉంది. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఈడీ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. 144 సెక్షన్ విధించారు.

### పవార్‌పై కేసు.. రాజకీయ అవకాశవాదమే – రాహుల్‌గాంధీ

నేషనలిస్ట కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ) అధినేత శరద్ పవార్‌పై ఈడీ కేసు నమోదు చేసిన నేపథ్యంలో భాజపా ప్రభుత్వంపై కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల ముందు శరద్‌పవార్‌ను టార్గెట్ చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రతీకార చర్యగా పేర్కొన్నారు. 'ప్రభుత్వం టార్గెట్ చేసిన తాజా ప్రతిపక్ష నేత శరద్‌పవార్‌జీ. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు నెల ముందు జరుగుతున్న ఈ పరిణామాలు రాజకీయ అవకాశవాదాన్ని అద్దంపడుతున్నాయని రాహుల్ ట్విటర్‌లో పేర్కొన్నారు.

# న్యూయార్క్‌లో పాక్‌కు షాక్

### – పాక్‌కు వ్యతిరేకంగా అగ్రరాజ్యంలో గళమెత్తిన ఆ దేశ మైనారిటీలు

### – న్యూయార్క్ వీధుల్లో పెద్ద ఎత్తున ప్రచారం

న్యూయార్క్, సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ) : అమెరికా రాజధాని న్యూయార్క్‌లో శుక్రవారం రద్దీ వీధుల్లో, రహదారులపై.. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రకటనలు దర్శనమిచ్చాయి. పాకిస్థాన్‌లో మైనారిటీలపై సాగుతున్న అరాచకాలు, అణచివేతపై గళమెత్తుతూ.. ట్యాక్సీలు, ట్రక్కులపై భారీ డిజిటల్ డిస్‌ప్లే ప్రకటనలు కనిపించాయి. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ప్రసంగించనున్న నేపథ్యంలో అగ్రరాజ్యంలో ఒక్కసారిగా ఈ ప్రచారం హోరెత్తడం గమనార్హం.

అమెరికాకు చెందిన హక్కుల సంస్థ వాయిస్ ఆఫ్ కరాచీ ఆధ్వర్యంలో పాక్ మైనారిటీల కోసం గళమెత్తుతూ న్యూయార్క్‌లో ఈ మేరకు పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. న్యూయార్క్‌లోని ఐరాస కార్యాలయం సమీపంలో ఈ ట్రక్కులు, ట్యాక్సీలు తిరుగుతూ కనిపించాయి. ఐరాస ప్రవచించిన మానవ హక్కులు పాకిస్థాన్‌లో ఏమాత్రం అమలవ్వడం లేదు.

పాక్ విషయంలో ఐరాస జోక్యం చేసుకోవాలని మొహాజిర్స్ డిమాండ్ చేస్తున్నారు' అని ప్రకటనల్లో ఉంది. మైనారిటీలైన మొహజిర్స్‌కు పాక్‌లో ఎలాంటి హక్కులు కల్పించడం లేదని, తమకు ఎదురవుతున్న అన్యాయాలు, అణచివేతపై కనీసం శాంతియుతంగా నిరసన తెలిపేందుకు కూడా మొహజిర్స్‌ను అనుమతించడం లేదని, ఈ నేపథ్యంలో అంతర్జాతీయ సమాజం, ఐరాస జోక్యం కోరుతూ ఈ ప్రచారం ప్రారంభించామని కరాచీ మాజీ మేయర్ వసే జలీల్ తెలిపారు.

# వేణు మాధవ్ మృతి షాక్‌కి గురి చేసింది: యూసఫ్ పఠాన్

న్యూఢిల్లీ,సెప్టెంబర్27 (ఆర్ ఎన్ఎ): విలక్షణమైన కామెడీతో ప్రేక్షకులని ఎంతగానో నవ్వించిన వేణుమాధవ్ అకాల మరణం అందరినీ కంటతడి పెట్టిస్తోంది. ప్రముఖ క్రికెటర్ యూసఫ్ పఠాన్ తన ట్విట్టర్ ద్వారా వేణు మాధవ్ మృతికి సంతాపం తెలియజేయడం విశేషం. ఒకప్పుడు ఇండియన్ టీంలో ఆల్‌రౌండర్‌గా రాణించిన యూసఫ్ తన ట్విట్టర్‌లో .. వేణు మాధవ్ చనిపోయారనే వార్త నన్ను షాక్‌కి గురి చేసింది. సిల్వర్ స్క్రీన్‌పై నేను చూసిన అద్భుత కమెడీయన్స్‌లో ఆయన ఒకరు. అతనిని ఎవరు రీప్లేస్ చేయలేరు. ఆయనకి నా నివాళులు. కుటుంబ సభ్యులకి, మిత్రులకి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను అని ట్వీట్‌లో పేర్కొన్నారు యూసఫ్ పఠాన్. వేణు మాధవ్ కేవలం తెలుగు ప్రేక్షకులనే కాక పలు ప్రాంతీయ భాషలకి చెందిన అభిమానులని తన హాస్యంతో ఎంతగానో అలరించారు. ఆయన మృతి హాస్య కుటుంబంతో పాటు అభిమానులని ఎంతగానో కలచివేసింది. నగరంలోని మౌలాలి హౌజింగ్ బోర్డ్ లక్ష్మీనగర్ శ్మశానవాటికలో వేణుమాధవ్ దహన సంస్కారాలు ముగిసాయి. వే ఆయనని కడసారి చూసేందుకు అభిమానులు, సెలబ్రిటీలు భారీగా తరలి వచ్చారు. ఆయన పార్థీవ దేహానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకి ప్రగాఢ సానుభూతి తెలిపారు .

# మేడ్చెల్ జిల్లా వైద్యారోగ్య శాఖలో ఉద్యోగాల భర్తీ

మేడ్చల్,సెప్టెంబర్27 (ఆంఎన్ఎ): మేడ్చల్ జిల్లాలో వైద్య, ఆరోగ్య శాఖలో ఉద్యోగాల భర్తీకి నోటీఫికేషన్‌ను విడుదల చేశారు. మెడికల్ ఆఫిసర్ పోస్టులు మూడు, ల్యాబ్ సూపర్‌వైజర్ ఒకటి, హెల్త్ విజిటర్స్ మూడు, ల్యాబ్ టెక్నీషియన్స్ రెండు పోస్టులు ఉన్నాయిని, కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాలను భర్తీ చేస్తామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ బి బ్లాక్‌లోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఈ నెల 30న మెడికల్ ఆఫీసర్ పోస్టుకు, అక్టోబర్ 3న ల్యాబ్ సూపర్‌వైజర్, హెల్త్ విజిటర్స్, ల్యాబ్ టెక్నీషియన్‌లకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని అన్నారు. అభ్యర్థులు విద్యార్హత పత్రాలతో హాజరుకావాలని కోరారు.

# రాష్ట్రం పచ్చదనంతో కళకళలాడాలి: మంత్రి

మేడ్చల్,సెప్టెంబర్27 (ఆర్ ఎన్ఎ): రాష్ట్రమంతా పచ్చదనంతో కళకళలాడాలని మంత్రి మల్లారెడ్డి ఆకాంక్షించారు. ప్రతి పౌరుడు విధిగా మొక్కలు నాటాలనీ, అలా చేసినపుడు మనం అనుకున్న లక్ష్యం నెరవేరుతుందని మంత్రి అన్నారు. చెట్లు ప్రగతికి మెట్లు అని తెలిపిన మంత్రి, చెట్లు ఉంటేనే మానవాలికి భవిష్యత్ ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. హరితహారంలో భాగంగా రాష్ట్రంలో ఇప్పటికే కోటిన్నరకు పైగా మొక్కలు నాటారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లిలో మంత్రులు సి. మల్లారెడ్డి, శ్రీనివాస్ గౌడ్ హరితహారం కార్యక్రమంలో పాల్గొని, ఈత మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..

మానవ మనుగడకు, వాతావరణ సమతుల్యతకు చెట్లే ప్రధాన కారణమని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎం వి రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ భాస్కర్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సునీత, ఎంపీపీ పద్మజ, జెడ్పీటీసీ శైలజ, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదంపై ఉమ్మడి చర్యలు



న్యూయార్క్, సెప్టెంబర్ 27: ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు కలిసి కట్టుగా పనిచేయాలని భారత్, న్యూజిలాండ్‌లు నిర్ణయించాయి. ఈ జాఢ్యాన్ని రూపుమాపేందుకు పరస్పరం సహకరించుకోవాలని ఇరుదేశాల ప్రధానులు నరేంద్ర మోదీ, జసిండా ఆర్డర్న్ నిర్ణయించారు. ఐక్యరాజ్య సమితి పర్యావరణ సదస్సులో మాట్లాడడానికి వచ్చిన మోదీ న్యూజిలాండ్ ప్రధానితో సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. అలాగే రాజకీయ, ఆర్థిక, రక్షణ, ప్రజా సంబంధాలను కూడా మెరుగు పరచుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇరుదేశాల ప్రధానులు నిర్ణయించారు. అంతర్జాతీయ, ప్రాంతీయ అంశాలు వీరిమధ్య చర్చల్లో ప్రస్తావనకు వచ్చాయని, ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో ఉమ్మడి అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. పుల్వామా, క్రైస్ట్ చర్చ్‌పై జరిగిన ఉగ్రదాడులను తీవ్రంగా ఖండించారని, ఇలాంటివి పునరావృతం కాకుండా కలిసి పనిచేయాలని నిర్ణయించినట్టు విదేశాంగ మంత్రిత్వశాఖ ఆ ప్రకటనలో తెలిపింది.

న్యూజిలాండ్‌లో ఉంటున్న భారతీయ సంతతి ప్రజలు ఇరుదేశాల సంబంధాల బలోపేతానికి ఎంతగానో తోడ్పడుతున్నారని, రెండు దేశాల మధ్య వారధిగా పనిచేస్తున్నారని న్యూజిలాండ్ ప్రధాని అన్నారు. అలాగే భారత్‌లో పెట్టుబడులు పెట్టడానికి తాలు క్రీయాశీలకంగా ఉన్నామని ఆమె తెలిపారు.

# వివాహేతర సంబంధం

### భర్త ఉసురు తీసిన భార్య

మహబూబాబాద్,సెప్టెంబర్ 27 (ఆర్ఎన్ఎ): తన వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడన్న కారణంతో ఓ మహిళ తన భర్తకు అన్నంలో విషం పెట్టి చంపేసింది. గూడూరు మండలం గుడిసెల తండాలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుడిసెల తండాకు చెందిన మోహన్(30), పావని భార్యాభర్తలు. అయితే అదే గ్రామానికి చెందిన శ్రీనుతో పావని వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం తెలుసుకున్న మోహన్ తండా పెద్దల దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో పావనిని తండా పెద్దలు మందలించారు. ఈ క్రమంలో భర్త మోహన్ పై కక్ష పెంచుకున్న పావని తన ప్రియుడు శ్రీనుతో కలిసి హత్యకు పథకం వేసింది. భర్త మోహన్ ను అడ్డుతొలగించాలని నిర్ణయం తీసుకుని అన్నంలో విషం పెట్టింది. ఈ అన్నం తిన్న మోహన్ అపస్మారక స్థితిలోకి వెళ్లి పోవడంతో అతని తల్లి హేమ్లి, తండావాసుల సాయంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మోహన్, పావని దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. తండ్రి చనిపోవడం, పావని జైలు పాలు కావడంతో వారు అనాథలుగా మారారు. ఈ ఘటనపై మోహన్ తల్లి హేమ్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోస్టుమార్టం కోసం మోహన్ మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

# కేసీఆర్ చేతిలో జగన్ కీలుబొమ్మలా మారుతున్నాడు

### – శ్రీవారికి కేసీఆర్ పట్టువస్త్రాలు ఇవ్వడమేంటి?

### – టీడీపీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు

అమరావతి, సెప్టెంబర్27 (ఆర్ ఎన్ఎ) : తెలంగాణ ముఖ్యమంత్రి చేతిలో జగన్ కీలుబొమ్మలా మారుతున్నారని టీడీపీ ఎమ్మెల్సీ అశోక్ బాబు ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తిరుమల బ్రహ్మోత్సవాల్లో శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ కేసీఆర్‌తో కలిసి ఇవ్వటమేంటని ప్రశ్నించారు. టీటీడీని కూడా తెలంగాణకు కట్టబెట్టే చర్యలు జరుగుతున్నాయా? అన్న సందేహం వ్యక్తం చేశారు. ఇద్దరి మధ్య ఎంత మిత్రుత్వం ఉన్నా... ఏపీ హక్కులను పోగొట్టుకోకూడదని సూచించారు. గోదావరి నీటి తరలింపు ఏపీ భూ భాగంలోనే జరగాలన్నారు. వైకుంఠ బ్యారేజీ నిర్మాణం ద్వారా ఇది సాధ్యమని చెప్పారు. అలా చేయకుండా దుమ్ముగూడెం నుంచి నాగార్జునసాగర్‌కు వయా నల్గొండ మీదుగా తీసుకురావడం రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతుందని వివరించారు. గోదావరి నీటి విషయంలో ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కావేరీ గొడవల తరహాలో భవిష్యత్తులో ఇక్కడా గొడవలు జరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఆర్టీసీని ప్రైవేటీకరణ చేసే కుట్రలు జరుగుతున్నాయని అనుమానం వ్యక్తం చేశారు. కేంద్రం సబ్సిడీకి ఇచ్చే ఎలక్ట్రిక్ బస్సులు కొనకుండా టెండరు పిలవడమేంటని నిలదీశారు.

# చంపాపేటలో నేడు పోలీస్ మీట్

సైదాబాద్,సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలకు, యువతకు మరింత దగ్గరయ్యేందుకు పోలీస్‌శాఖ కృషి చేస్తున్నది. అందులో భాగంగా ఈస్ట్ జోన్ పరిధిలోని సైదాబాద్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు చంపాపేటలోని లక్ష్మి గార్డెన్‌లో మెగా జాబ్ కనెక్ట్ మేళాను నిర్వహిస్తున్నారు. ఈ జాబ్‌మేళాను ఈస్ట్ జోన్ డీసీపీ, నగర జాయింట్ కమిషనర్ రమేశ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నారు. పదవ తరగతి ఫెయిల్ అయిన వారి నుంచి డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొని నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రవేశం, రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఉచితం. 20 కంపెనీలు 3 వేల ఉద్యోగాలను భర్తీ చేయటానికి సంకల్పించారని, వివరాలకు 040-27854785, 9490616391 లో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాస్ తెలిపారు.

# రెండు రాజ్యసభ సీట్లకు 16న ఎన్నికలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ): అరుణ్ జైట్లీ, రాంజత్మలానీల మృతితో ఏర్పడ్డ రెండు రాజ్యసభ ఖాళీలను భర్తీ చేసేందుకు ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ మేరకు ఈ రెండు స్థానాల్లో ఎన్నికలు నిర్వహించ నున్నారు. ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో ఖాళీ అయిన రెండు రాజ్యసభ స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ రెండు స్థానాలకు అక్టోబర్ 16వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. 2018లో అరుణ్ జైట్లీ ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎంపికయ్యారు. ఈ ఏడాది ఆగస్టు 24వ తేదీన జైట్లీ తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఇక సుప్రీంకోర్టు న్యాయవాది, మాజీ కేంద్ర మంత్రి రాంజెత్మలానీ బీహార్ నుంచి రాజ్యసభకు ఎన్నిక కాగా, ఈ నెల 8వ తేదీన కన్నుమూశారు. ఈ క్రమంలో ఈ రెండు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు.

# టాప్' లేపిన దీపక్ పునియా






న్యూఢిల్లీ: వరల్డ్ ఛాంపియన్‌షిప్ సిల్వర్ మెడలిస్ట్, భారత స్టార్ రెజ్లర్ దీపక్ పునియా రెజ్లింగ్ ర్యాంకింగ్స్‌లో అదరగొట్టాడు. 86 కేజీల విభాగంలో ప్రపంచ నంబర్ వన్‌గా అవతరించాడు. 65 కేజీల కేటగిరిలో మరో రెజ్లర్ బజరంగ్ పునియా టాప్ ర్యాంకును చేజార్చుకున్నాడు. తాజాగా యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ ఫెడరేషన్ ర్యాంకింగ్స్‌ను ప్రకటించింది.

సీనియర్ వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో తొలిసారి పోటీపడిన దీపక్ మోకాలి గాయం కారణంగా టోర్నీ మధ్యలోనే వైదొలిగిన విషయం తెలిసిందే. ఫైనల్లో ఇరాన్ రెజ్లర్ హసన్ యజ్దానితో దీపక్ తలపడాల్సి ఉంది. మధ్యలోనే పోటీ నుంచి తప్పుకోవడంతో దీపక్ వెండి పతకంతో సరిపెట్టుకున్నాడు. 20ఏండ్ల దీపక్ 82 పాయింట్లతో వరల్డ్ ఛాంపియన్ యజ్దానీ కన్నా నాలుగు పాయింట్లు ముందంజలో ఉన్నాడు. ఈ ఏడాది అంతర్జాతీయ టోర్నీల్లో అతడు అద్భుత ప్రదర్శనతో పతకాలు కొల్లగొట్టాడు.

అదే సమయంలో వరల్డ్ నంబర్‌వన్‌గా ఛాంపియన్‌షిప్‌లో అడుగుపెట్టిన బజరంగ్ కాంస్య పతకంతో సరిపెట్టుకొని తాజా ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి పడిపోయాడు. 25ఏండ్ల బజరంగ్ 63 పాయింట్లతో ఉన్నాడు.

స్వర్ణ పతకం నెగ్గిన రష్యా రెజ్లర్ రషిదోవ్ 65 కేజీల విభాగంలో కొత్త ఛాంపియన్‌గా అవతరించాడు. 57 కేజీల కేటగిరిలో కాంస్య పతక విజేత రవి దాహియా టాప్-5లోకి దూసుకొచ్చాడు. 39 పాయింట్లతో ఐదో స్థానంలో నిలువగా.. కాంస్యంతో మెరిసిన రాహుల్ అవారే రెండో ర్యాంకు దక్కించుకున్నాడు. మహిళల ర్యాంకింగ్స్‌లో వినేశ్ ఫొగట్(53కేజీ) రెండు, సీమా బిస్లా(50కేజీ) మూడు, పూజా దండా(59కేజీ) ఐదో ర్యాంకుల్లో కొనసాగుతున్నారు.

# నంబర్ 4లో ఆడేందుకు నేను రెడీ!

క్రీడలు

చెన్నై: టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్‌లో నాలుగో స్థానంపై చర్చకు అంతే లేదు. పరిమిత ఓవర్ల క్రికెట్లో నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేసే ఆటగాడి కోసం టీమ్ మేనేజ్‌మెంట్ గత రెండేండ్లుగా కసరత్తు చేస్తోంది. ప్రపంచకప్ ముందు నుంచీ ఎంతో మంది ఆటగాళ్లను ఆ స్థానంలో పరీక్షించినప్పటికీ ఏ ఒక్క ఆటగాడు ఆ స్థానాన్ని భర్తీ చేయలేకపోయాడు. భారత జాతీయ జట్టులో తిరిగి చోటు దక్కించుకోవాలని సీనియర్ ఆల్‌రౌండర్ సురేశ్ రైనా తీవ్రంగా శ్రమిస్తున్నాడు. ఇటీవల మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న రైనా కోలుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో నాలుగో స్థానంపై రైనా కన్నేశాడు. రైనా చివరిసారిగా 2018లో ఇంగ్లాండ్‌తో మ్యాచ్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 2020, 2021 టీ20 ప్రపంచకప్‌లను దృష్టిలో ఉంచుకొని నంబర్.4లో బరిలో దిగాలనుకుంటున్నట్లు రైనా పేర్కొన్నాడు.

32ఏండ్ల రైనా మాట్లాడుతూ.. 'భారత జట్టులో నాలుగో నంబర్‌లో నేను ఆడగలను. గతంలో ఇదే స్థానంలో ఆడాను. అద్భుతంగా రాణించాను. త్వరలో జరిగే రెండు టీ20 ప్రపంచకప్‌ల్లో ఆడేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను.' అని అన్నాడు. రైనా అంతర్జాతీయ వన్డేల్లో 5,615 పరుగులు.. టీ20ల్లో 1,604 రన్స్ సాధించాడు.

నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేస్తున్న యువ వికెట్‌కీపర్ రిషబ్ పంత్ దారుణ వైఫల్యంపైనా రైనా స్పందించాడు. 'పంత్ అయోమయానికి లోనవుతున్నాడు. తన సహజసిద్ధమైన ఆటను ఆడట్లేదు.

అతను సింగిల్స్ కోసం చూస్తున్నాడు. డిఫెన్స్ ఆడుతూ విఫలమవుతున్నాడు. ఎలాగైతే మహేంద్ర సింగ్ ధోనీ సహచర ఆటగాళ్లకు మార్గనిర్దేశనం చేస్తాడో అదే మాదిరిగా పంత్‌తోనూ ఎవరైనా చర్చించి గాడిలో పెట్టాలి. క్రికెట్ ఓ మానసిక క్రీడ. దూకుడుగా ఆడేందుకు పంత్‌కు అందరూ మద్దతుగా నిలువాలి. ప్రస్తుతం అతడు కొన్ని సూచనల ప్రకారం ఆడుతున్నట్లు అన్పిస్తోంది. అవి సరిగ్గా పనిచేయట్లేదు. ధోనీ ఇంకా చాలా ఫిట్‌గా ఉన్నాడు. అతనొక అద్భుతమైన వికెట్ కీపర్. ప్రస్తుత అంతర్జాతీయ క్రికెట్లో గ్రేటెస్ట్ ఫినిషర్ అతనే. టీ20 ప్రపంచకప్‌లో భారత్‌కు ధోనీ పెద్ద ఆస్తి' అని రైనా వివరించాడు.




# రామప్పను వారసత్వ సంపదగా గుర్తించాలి: ఎమ్మెల్సీ



హైదరాబాద్,సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ): రామప్ప ఆలయాన్ని ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించాలని యునెస్కో బృందాన్ని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి కోరారు. హైదరాబాద్ లో యునెస్కో బృందాన్ని కలిసిన ఆయన రామప్ప దేవాలయ విశిష్టతను, ఆలయ చరిత్రను, శిల్ప కళావైభవాన్ని తెలియచేసే ఆలయ దృశ్యమాలికని (డాక్యుమెంటరి) యునెస్కో ప్రతినిధి అయిన వాసు పోష్యనందన్ కు అందజేశారు. ఆగస్టులో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ములుగు జిల్లా కలెక్టరు నారాయణరెడ్డితో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రామప్ప దేవాలయాన్ని సందర్శించి యునెస్కో బృందం గుర్తింపు ఉండేలా కొన్ని అబివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన చేసి, ప్రపంచ గుర్తింపు ఉండేలా, రామప్ప శిల్పకళా వైభవాన్ని ఒక డాక్యుమెంటరీ రూపంలో తయారుచేశారు. ఆ డాక్యుమెంటరీని యునెస్కో బృందానికి ఇవాళ అందజేశారు. ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి వెంట రాష్ట్ర దివ్యంగుల కార్పొరేషన్ చైర్మన్ డా.కె.వాసుదేవరెడ్డి, టిఆర్ఎస్ యువజన నాయకులు వై.సతీష్ రెడ్డి, జి.వంశిధర్ రెడ్డి ఉన్నారు.

## అప్పుతీసుకుని బెదిరింపు

### కేసులో రెండేళ్ల జైలు విధించిన కోర్టు

హైదరాబాద్,సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ): అప్పు తీసుకుంది..అడిగితే బెదిరించింది. ఈ కేసులో కోర్టును ఆశ్రయిస్తే రెండేండ్ల శిక్ష పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సైనిక్‌పురి ప్రాంతానికి చెందిన రాధాదేవి, రమాదేవి స్నేహితులు. వీరి వద్ద నుంచి నేరేడ్‌మెట్ భరణి కాలనీకి చెందిన అరుంధతి రూ.15 లక్షలను అప్పుగా తీసుకుంది. దీనికి బాండ్ పేపర్ రాసి ఇవ్వడంతో పాటు ఏడాదిలోపు తిరిగి ఇచ్చేస్తానని చెప్పింది. ఏడాది దాటినా డబ్బులు తిరిగి ఇవ్వలేదు. అడిగితే దుర్భాషలాడడంతో పాటు తీవ్రంగా హెచ్చరించింది. దీంతో రాధాదేవి, రమాదేవిలు నేరేడ్‌మెట్ పోలీసులకు 2016 మేలో ఫిర్యాదు చేశారు. ఈ కేసుపై ఎస్ఐ ప్రవీణ్‌బాబు పూర్తి అభియోగాలపై పూర్తి ఆధారాలు పొందుపర్చడంతో విచారించిన కోర్టు అరుంధతికి రెండేండ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించింది.

## పాతనేరస్థుడు అరెస్ట్: చోరీ సొత్తు స్వాధీనం

హైదరాబాద్,సెప్టెంబర్27 (ఆర్ఎన్ఎ): దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్థుడిని రాజేంద్రనగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పక్కా సమాచరాంతో అతడిని పట్టుకున్నారు. ఎంతోకాలంగా తప్పించుకుని తిరుగుతన్న నిందితుడి నుంచి 17 తులాల బంగారం ఆభరణాలు, అరకిలో వెండి, కారు, రూ.1.4లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. గోల్కొండ ప్రాంతంలో నివాసం ఉండే ఇబ్రహీం పాత నేరస్థుడు. ఇతనిపై పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉన్నాయి. కాగా... నలంద నగర్‌లో ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించారు. అతడు పోర్డు ఐకాన్ కారులో వచ్చి చోరీకి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే అతన్ని అదుపులోకి తీసుకుని.. చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కుక్కల దాడిలో విద్యార్థినికి తీవ్ర గాయాలు

వరంగల్, సెప్టెంబర్27 (ఆర్ఎన్ఎ) : ఇంజినీరింగ్ కాలేజీలో దారుణం చోటుచేసుకుంది. బీటెక్ సెంకండియర్ చదువుతున్న ఓ విద్యార్థినిపై కాలేజీలోని కుక్కలు ఒక్కసారిగా దాడిచేశాయి. దీంతో ఆ అమ్మాయి పరిస్థితి విషమంగా ఉంది. నర్సంపేట మండలం లక్నేపల్లి శివారులోని బాలాజీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. రమ్య అనే విద్యార్థిని బాలాజీ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ సెంకండియర్ చదువుతోంది. కాలేజీ హాస్టల్‌లో ఉంటున్న రమ్యపై శుక్రవారం కాలేజీలో ఉండే కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. దీంతో తీవ్రంగా గాయపడిన రమ్య పరిస్థితి విషమంగా ఉంది. ఆమెను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాలేజీలో ఫ్రెషర్ డే నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో కాలేజీలో చదువుతున్న విద్యార్థినిపై కుక్కలు దాడి చేసి.. తీవ్రంగా గాయపర్చడం విద్యార్థులను ఆందోళనకు గురిచేసింది. రమ్య పరిస్థితి విషమంగా ఉండటంతో కాలేజీ ముందు విద్యార్థులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నారు.

# ఈఎస్ఐ డైరెక్టర్ దేవికారాణి అరెస్టు

### – మరో ఆరుగురు ఉద్యోగులను అదుపులోకి తీసుకున్న ఏసీబీ

హైదరాబాద్, సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ) : ఈఎస్ఐ దవాఖానాలకు, డిస్పెన్సరీలకు మందులు కొనుగోలుచేసి సరఫరాచేసే సంస్థ ఐఎంఎస్ (ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్) డైరెక్టరేట్‌లో భారీ కుంభకోణం బయటపడిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఐఎంఎస్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ దేవికారాణి ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం షేక్‌పేటకు వచ్చిన ఏసీబీ అధికారులు...ఆమె నివాసంలో అరెస్టు చేసి బంజారాహిల్స్ ఏసీబీ కార్యాలయానికి తరలించారు. ఇదిలా ఉంటే దేవికారాణితో పాటు మరో ఆరుగురు ఉద్యోగులను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కే పద్మ, వసంత ఇందిర (అసిస్టెంట్ డైరెక్టర్), రాధిక ఫార్మాసిస్ట్, హర్షవర్ధన్ (సీనియర్ అసిస్టెంట్), ఓమ్ని మెడి కంపెనీ ఎండీ శ్రీహరి, నాగరాజు (ఉద్యోగి) ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసి..బంజారాహిల్స్ ఏసీబీ కార్యాలయానికి తరలించారు. పక్కా ఆధారాలతో ఏసీబీ అధికారులు గురువారం ఉదయం నుంచి ఏకకాలంలో 23 చోట్ల సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. పలు కీలకపత్రాలను ఏసీబీ అధికారులు గుర్తించినట్టు సమాచారం. ఏసీబీ అధికారుల ప్రకటన ప్రకారం..ఇప్పటి వరకు రూ.11,69,12,485 మేర అక్రమాలు వెలుగుచూశాయి. 2018 నవంబర్ 3న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌కు గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫిర్యాదు అందింది. దీన్ని బేస్ చేసుకుని ఏసీబీ అధికారులు ప్రాథమికంగా వివరాలు సేకరించే పనిలో ఉండగా... ఈఎస్ఐ డైరెక్టర్ దేవికారాణిపై అనేక ఆరోపణలు ఉన్నట్టుగా ఈడీకి తెలిసింది. దేవికారాణికి అనేక బినామి కంపెనీలున్నాయని... మందుల కొనుగోళ్లలో వందల కోట్ల కుంభకోణం చేసినట్లు సమాచారం అందింది. అంతేకాకుండా మందులు సప్లై చేయకుండానే దాదాపుగా 200కోట్లకు బిల్లులు సృష్టించారంటూ ఫిర్యాదుదారుడు తీవ్రమైన ఆరోపణలు చేశాడు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ విచారణ చేపట్టింది. 23మంది ఇళ్లలో సెప్టెంబర్ గురువారం ఏసీబీ సోదాలు నిర్వహించింది. దాదాపు 24 గంటలపాటు సుదీర్ఘంగా తనిఖీలు చేపట్టింది. పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకుంది. 10 కోట్ల మేర అవకతవకలకు పాల్పడినట్టుగా పత్రాలతో సహా ఏసీబీ ఆధారాలు సేకరించింది. మరోవైపు 100 కోట్ల మేర అవినీతి జరిగినట్టుగా అధికారులకు ప్రాథమికంగా సమాచారం అందినట్టు తెలుస్తోంది. తీగ లాగితే డొంక కదిలినట్టుగా... తవ్వుతున్న కొద్దీ మందుల కొనుగోళ్లలో అవినీతి బయటపడుతోంది.

# నల్గొండ జిల్లాలో దారుణం

### – మూడునెలల చిన్నారిని బండకేసి కొట్టిన మేనమామ
### – తీవ్ర గాయాలతో మృతిచెందిన చిన్నారి

నల్గొండ, సెప్టెంబర్27(ఆర్ఎన్ఎ) : నల్గొండ జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. నెలలు నిండని ఓ చిన్నారిపై తాగుడు బానిసైన సొంత మేనమామే కిరాతకంగా ప్రవర్తించాడు. మద్యానికి డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో చిన్నారిని నేలకేసి కొట్టి.. చంపాడు. ఈ దారుణ ఘటన నల్గొండ జిల్లాలోని పెద్దవూర మండలం చిన్నగూడెంలో శుక్రవారం జరిగింది. గుంటూరు జిల్లాకు చెందిన లక్ష్మి, వెంకటేశ్వర్లు దంపతులుకు ఇద్దరు కుమార్తెలు. మరోసారి గర్భవతి అయిన లక్ష్మీ మూడు నెలల క్రితం డెలివరీ కోసం నల్లగొండలోని తన స్వగ్రామానికి వచ్చింది. డెలివరీ అనంతరం తల్లిగారి ఇంటి వద్ద ఆమె ఉండగా.. శుక్రవారం పెద్ద కూతురు పుట్టిన రోజు కావడంతో తండ్రి వెంకటేశ్వర్లు అత్తవారింటికి వచ్చాడు. ఈ సమయంలో మద్యానికి బానిసైన లక్ష్మీ సోదరుడు ఉపేందర్ తన తండ్రితో డబ్బులు కావాలని గొడవ పడ్డారు. తండ్రి డబ్బులు ఇవ్వకపోవడంతో.. కోపంతో తాగిన మత్తులో అక్క కుమార్తె అయిన మూడు నెలల చిన్నారిని బండకేసి కొట్టాడు. దీంతో చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ క్రమంలో నిందితుడు పారిపోవ డానికి ప్రయత్నిస్తుండగా గ్రామస్తులు పట్టుకొని స్తంభానికి కట్టివేసి పోలీసులకు సమాచారం అందించారు. భయంతో చిన్నారి తల్లి లక్ష్మీ, అమ్మమ్మ కూడా అక్కడి నుంచి పారిపోయారు. అనంతరం సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అయితే గతంలో కూడా ఉపేందర్ తన తండ్రిపై, అక్కలపై కత్తితో దాడి చేశారని, ఊరులోని ఆడవాళ్లతో దురుసుగా ప్రవర్తించే వాడని గ్రామస్తులు పోలీసుల ముందు వాపోయారు. భార్య, పిల్లలను తీసుకొని సొంత ఊరికి వెళ్లడానికి వచ్చానని, ఆలోపే తన బిడ్డను చంపాడని చిన్నారి తండ్రి వెంకటేశ్వర్లు కన్నీటి పర్యంతమయ్యారు.

# బీజేపీ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుంది

### – జగన్‌కు విజయసాయి గుదిబండలా మారాడు
### – అక్రమాలుంటే కూల్చండి.. రాజకీయ కక్షలు వీడాలి
### – సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

న్యూఢిల్లీ, సెప్టెంబర్27 (ఆర్ఎన్ఎ) : ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి విజయసాయిరెడ్డి గుదిబండలా మారాడని, రాజకీయ కక్షలతో పాలన సాగించడం సరికాదని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు.. ఈ సందర్భంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, జగన్ సర్కారుపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

పార్టీ ఫిరాయింపుల విషయంలో బీజేపీ వైఖరిపై ఆయన దుమ్మెత్తిపోశారు. కాషాయ పార్టీ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని అన్నారు. బీజేపీలో చేరితే గంగిగోవు.. లేకపోతే దేశద్రోహి అన్నట్టు దేశంలో ప్రస్తుత పరిస్థితి ఉందని ఎద్దేశా చేశారు.

పశ్చిమ్ బెంగాల్‌లోని శారదా చిట్స్ కుంభకోణం కేసును ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ కేసులో ఐదుగురు ఆరోపణలు ఎదుర్కొంటే వారిలో ముకుల్‌రాయ్ బీజేపీలో చేరారని, ఆయన్న మినహాయించి మిగతావారిపై సీబీఐ ఛార్జిషీట్లు దాఖలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

అమరావతి ప్రాంతంలో కరకట్టపై నిర్మాణాల కూల్చివేత, గ్రామ వాలంటీర్ ఉద్యోగాలలో 90 శాతం వైఎస్ఆర్సీపీ కార్యకర్తలేనని విజయసాయిరెడ్డి అన్న వ్యాఖ్యలపై నారాయణ మండిపడ్డారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతికూల రాజకీయాలు వీడాలని హితవు పలికారు. నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా ఉంటే కూల్చివేయాలి తప్ప రాజకీయ కక్ష సాధింపుతో చేయడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు

. అలాగే కోడెలపై కేసులు పెట్టాలని ట్వీట్లు చేయడం.. ఉద్యోగాల్లో 90శాతం మనవాళ్లే అనడం ద్వారా సీఎం జగన్‌కు విజయసాయిరెడ్డి గుదిబండగా మారారని నారాయణ అభిప్రాయ పడ్డారు.

జగన్మోహన్‌రెడ్డి ప్రజాపాలను సాగించాలని, అలా కాకుండా రాజకీయ కక్షలతో పాలన సాగించాలని చూస్తే ఆయనకు ఓట్లేసిన ప్రజలే తిరగబడుతారని అన్నారు.

సినిమా

# దీపావళికి 'శూరరై పోట్రు' రిలీజ్

తమిళ స్టార్ హీరో సూర్య వరుస సినిమాలతో ప్రేక్షకులకి మంచి వినోదం అందిస్తున్నాడు. ఆయన నటించిన ఎన్‌జీకే ఈ ఏడాది మేలో విడుదలై ప్రేక్షకులని ఆకట్టుకుంది

. ఇక రీసెంట్‌గా కప్పాన్ అనే మల్టీ స్టారర్ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. ఈ చిత్రం మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. తెలుగులో ఈ చిత్రం బందోబస్త్ పేరుతో విడుదలైంది. ఇక సూర్య 38వ చిత్రం శూరరై పోట్రు అనే టైటిల్‌తో తెరకెక్కుతుండగా, ఈ త్రాన్ని గురు ఫేం సుధా కొంగర తెరకెక్కిస్తున్నారు. సూర్య నిర్మాణంలోనే ఈ మూవీ రూపొందుతుంది. శూరరై పోట్రు అంటే శూరులను కీర్తించాలన్నది తెలుగు అర్ధం. ఎయిర్ డెక్కన్ వ్యవస్థాపకులు పైలెట్ జీఆర్ గోపీనాథ్ జీవితం ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతుంది .

'సర్వం తాళమయం' ఫేమ్ అపర్ణా బాలమురళి హీరోయిన్‌గా నటిస్తున్నారు. మోహన్‌బాబు ఓ కీలక పాత్రలో నటిస్తున్నారు. జీవీ ప్రకాశ్‌కుమార్ సంగీత దర్శకుడిగా పని చేస్తున్నారు. రీసెంట్‌గా చిత్ర షూటింగ్ పూర్తి కాగా, దీపావళి కానుకగా చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమాతో మంచి హిట్ కొట్టాలని సూర్య భావిస్తున్నాడు.




# అచనాలు మరింత పెంచిన 'సైరా' ట్రైలర్ 2

మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న భారీ చారిత్రక చిత్రం సైరా నరసింహారెడ్డి. తొలి స్వాతంత్ర్య సమరయోధుడు ఉ య్యాలవాడ నరసింహారెడ్డి కథతో తెరకెక్కుతున్న ఈ సినిమాను సురేందర్ రెడ్డి

దర్శకత్వంలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నాడు. ఇప్పటికే అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా గాంధీ జయంతి కానుకగా అక్టోబర్ 2న తెలుగు, తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఇప్పటికే రిలీజ్ అయిన టీజర్, ట్రైలర్‌లకు సూపర్బ్ రెస్పాన్స్ రావటంతో సినిమా మీద అంచనాలు భారీగా పెరిగిపోయాయి. ఇప్పుడు ఆ అంచనాలు మరింత పెంచేస్తూ మరో ట్రైలర్‌ను రిలీజ్ చేశారు చిత్రయూనిట్. యుద్ధ సన్నివేశాలకు సంబంధించిన ఈ ట్రైలర్ అభిమానుల్లో అంచనాలను తారా స్థాయికి తీసుకెళ్లేలా ఉంది. యాక్షన్ సీన్స్‌లో చిరు లుక్స్ వావ్ అనిపించేలా ఉన్నాయి.

ఈ ట్రైలర్‌లో చిరుతో పాటు సుధీప్, విజయ్ సేతుపతి, జగపతి బాబు పాత్రలను కూడా ప్రధానం చూపించారు. దాదాపు 250 కోట్ల బ్జడెట్‌తో రూపొందిన ఈ సినిమాలో బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ కీలక పాత్రలో నటిస్తుండగా లేడీ సూపర్ స్టార్ నయనతార చిరుకు జోడిగా నటిస్తున్నారు. మిల్కీ బ్యూటీ తమన్నా మరో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# డిసెంబర్‌లో నయనతార పెళ్లి!



దక్షిణాదిలో అగ్ర కథానాయకి నయనతార అయితే, తమిళసినిమాలో సంచలన జంట దర్శకుడు విఘ్నేశ్‌శివన్, నయనతారనే. దాదాపు అర్ధ దశాబ్దానికి పైగా ప్రేమ, సహజీవనం అంటూ వార్తల్లో నిలుస్తున్నారీ జంట. వీరిద్దరిలో ఏ ఒక్కరికి సంబంధించిన విశేషం అయినా కలిసి వేడుకగా జరుపుకుంటూ ఎంజాయ్ చేస్తున్నారు. అదేవిధంగా సమస్యల్లోనూ ఒకరికొకరు అండగా నిలబడుతున్నారు.

ఆ మధ్య సీనియర్ నటుడు రాధారవి నయనతారపై అనుచిత వ్యాఖ్యలు చేయగా, అందుకు దర్శకుడు విఘ్నేశ్‌శివన్ ఘాటుగానే స్పందించాడు. నయనతారను తన దేవతగా భావిస్తూ ఆమె ప్రతి అడుగులోనూ అడుగేస్తున్నాడు. అయితే వీరి సహజీవనం గురించి రకరకాల వదంతులు వైరల్ అవుతూనే ఉన్నాయి. వాటిని పట్టించుకోకుండా తన అనుబంధాన్ని కొనసాగిస్తున్నారు. ఆ మధ్య నయనతార తన ప్రియుడికి ఖరీదైన కారును బహుమతిగా ఇచ్చిందనే ప్రచారం కూడా జరిగింది.

తాజాగా తన ప్రియుడ్ని నిర్మాతగా చేసింది నయన్. అవును విఘ్నేశ్‌శివన్ రౌడీ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మించనున్న నెట్టికన్ చిత్రంలో నయనతార నటించనున్న విషయం తెలిసిందే. తాజాగా ఏకంగా ఆయనకు భర్త పాత్రను ఇవ్వడానికి నయనతార సిద్ధం అవుతున్నట్లు సమాచారం. నిజానికి ఈ సంచలన జంట పెళ్లి వార్తలు చాలా కాలం నుంచి వస్తున్నాయి. అయితే వాటికి పెద్దగా ప్రాధాన్యతనివ్వలేదు.

అయితే ఆ మధ్య ఒక జోతీష్యుడు నయనతార పెళ్లి డిసెంబర్ నెలలో జరిగే అవకాశం ఉందని చెప్పారు. ప్రస్తుతం పరిణామాలను చూస్తుంటే విఘ్నేశ్‌శివన్, నయనతారల వివాహానికి సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అవును వీరి పెళ్లి వచ్చే డిసెంబర్ 25న జరగనుందనే టాక్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

ఈ జంట వివాహ వేడుకలు 5 రోజుల పాటు నిర్వహించడానికి సన్నాహాలు జరుగుతున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వేడుకలు చెన్నైలోనూ, కేరళలోనే కాదట. ఉత్తరాదిలోనో, లేక విదేశాల్లోనూ క్రిస్మస్ పర్వదినం సందర్భంగా జరుపుకోనున్నట్లు ప్రచారం జోరందుకుంది. అయితే దీని గురించి ఈ సంచలన జంట నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నది గమనార్హం.

## నాగశౌర్యకు జంటగా మృణాల్ ఠాకూర్

బాలీవుడ్ చిత్రాలు 'సూపర్ 30', 'బాట్లా హౌస్' చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన మృణాల్ ఠాకూర్ త్వరలోనే తెలుగు ప్రేక్షకులను పలకరించనున్నారు. వివరాల్లోకెళ్తే.. నాగశౌర్య హీరోగా లక్ష్మీ సౌజన్య దర్శకత్వంలో ఓ సినిమా ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్‌ను ఎంపిక చేశారని విశ్వసనీయ వర్గాల సమాచారం. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ అక్టోబర్‌లో ప్రారంభం కానుంది. వచ్చే ఏడాది మే నెలలో సినిమాను విడుదల చేయాలని అనుకుంటున్నారట. ఈ చిత్రానికి 'మూగమనసులు 2020' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు టాక్.

# ఖైరతాబాద్ వద్ద వాహనాల దారి మళ్లింపు



హైదరాబాద్ : ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ కింద రహదారిపై వర్షపు నీరు భారీగా నిలిచిపోయింది. నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ప్రధాన రహదారిపై నిలిచిన నీటిని తొలగించేందుకు ట్రాఫిక్ పోలీసులు వాహనాలను దారి మళ్లిస్తున్నారు. అమీర్‌పేట్, కూకట్‌పల్లి వైపు వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలను సచివాలయం, ట్యాంక్‌బండ్ మీదుగా మళ్లిస్తున్నారు.

మల్కాజ్‌గిరి ఎన్‌ఎండీసీ కాలనీలో మోకాలి లోతు వరద నీరు వచ్చి చేరింది. దీంతో ప్రజలు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. అంబులెన్స్‌కు ఫోన్ చేసినా వరద నీటిలో రాలేమని అధికారులు చెబుతున్నారని స్థాని కులు వాపోయారు. పాతబస్తీలోని జహనుమా వద్ద ఓ ప్రయివేటు పాఠశాల ప్రహరీ గోడ కూ లిపోయింది. దీంతో నాలుగు కార్లు ధ్వంసమయ్యాయి.

# ఉద్యమకారులకు టీఆర్‌ఎస్ గుర్తింపు: ఎమ్మెల్యే

వరంగల్,సెప్టెంబర్27(ఆర్‌ఎన్‌ఎ): సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న వారందరినీ గుర్తించి వారికి సముచిత గౌరవాన్ని ఇస్తున్నారని ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమ నేతలందరికీ నామినేటెడ్ పదవులతో సీఎం కేసీఆర్ గౌరవించారని అన్నారు. రాష్ట్రంలోని అనేకమంది తెలంగాణ ఉద్యమకారుల కు ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్‌ల స్థాయిని చేకూర్చారన్నారు. తాను కూడా ఉద్యమ కారుడిగా ఉండటం వల్లే చీఫ్‌విప్ పదవి లభించిందన్నారు. బంగారు తెలంగాణ నిర్మాణం కోసం సీఎం కేసీఆర్ చేస్తున్న కృషికి ప్రతీఒక్కరూ చేయూతనివ్వాలన్నారు. మైనార్టీల సంక్షేమం సీఎం కేసీఆర్ సారథ్యంలో టీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే సాధ్యమైందన్నారు. గత ప్రభుత్వాలు మైనార్టీలను పూర్తిగా నిర్లక్ష్యానికి గురిచేశాయన్నారు. రానున్న రోజుల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా రూపుదాలుస్తోందన్నారు. మరోమారు గెలిపిస్తే లక్ష్యసాధనలో ముందుకు సాగగలమని అన్నారు. పేద ప్రజల కోసం ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇండ్లు, మిషన్ భగీరథ, నిరుపేద విద్యార్థులకు మోడల్ స్కూళ్ల ఏర్పాటు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు ఎంతో ఖ్యాతిని పొందాయని అన్నారు.

## బతుకమ్మకు భారీగా ఏర్పాట్లు

ఆదిలాబాద్,సెప్టెంబర్27 (ఆర్‌ఎన్‌ఎ): ఆదిలాబాద్‌లో బతుకమ్మ ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. భారీగా బతుకమ్మలతో ఊరేగింపు తీసి నిమజ్జనం చేసేవరకు పెద్ద ఎత్తున మహిళలు, యువతులు తరలి రానున్నారు. తొమ్మిది రోజులు జోరుగా సాగుతున్న ఉత్సవాలు సద్దుల బతుకమ్మతో ముగియన న్నాయి.

బతుకమ్మ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అధికారులు అన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మహా బతుకమ్మ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. పట్టణంలోని ఖానాపూర్ చెరువు వద్ద ఉన్న బతుకమ్మ ఘాట్ వద్ద ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. నిమజ్జన కార్యక్రమానికి పెద్ద ఎత్తున మహిళలు, యువతులు తరలి వస్తారని వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఖానాపూర్ చెరువు వద్ద బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు మెట్లు నిర్మించామని, తాగునీటి సదుపాయం, లైటింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా కార్మికులను నియమించామని తెలిపారు. చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేసే సమయంలో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ఘాట్ల వద్ద గజ ఈతగాళ్లను, సహాయకులను నియమించామన్నారు. రాష్ట్రంలో అత్యంత వైభవంగా నిర్వహించుకునే బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ప్రజలను తరలించేందుకు ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పండుగల సందర్భంగా రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు డిపోల వారీగా అదనపు బస్సులను ఏర్పాటు చేశారు. బస్సుల్లో సీట్లు దొరక్క చాలా మంది ప్రయాణికులు ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తారు. ఇదే అదనుగా భావించి వారు ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేస్తారు. దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు ఆర్టీసీ యాజమాన్యం అన్ని డిపోల వారీగా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. పండుగ అనంతరంప్రజలు తిరిగి వెళ్లేందుకు బస్సులను సిద్ధం చేశారు. ప్రయాణికుల రద్దీని బట్టి అప్పటికప్పుడు మరిన్ని బస్సులను పెంచేందుకు సిద్ధంగా ఉన్నామని ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు.

# శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

### 29న రాత్రి అంకురార్పణ
### ఆర్జిత సేవలు రద్దు ..భారీగా ఏర్పాట్లు

తిరుమల,సెప్టెంబర్27 (ఆర్‌ఎన్‌ఎ): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలకు రంగం సిద్ధమయ్యింది. అత్యంత వైభవంగా ఏటా జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం అంకురార్పణతో శ్రీకారం చుట్టనున్నారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం రాత్రి 7.00 నుండి 8.00 గంటల వరకు శాస్త్రోక్తంగా అంకురార్పణం జరుగనుంది. 30 నుంచి అక్టోబరు 8వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. దీంతో బ్రహ్మోత్సవాలను పురస్కరించి స్వామి వారి ఆర్జిత సేవలను రద్దు చేశారు. ఆదివారం సాయంత్రం అంకురార్పణ జరుగనుంది. ధ్వజారోహణకు ముందు రోజు సాయంకాలం శ్రీవారి సేనాధిపతులైన శ్రీవిష్వక్సేనులవారు ఆలయానికి నైరుతి వైపున ఉన్న వసంత మండపానికి వేంచేస్తారు. ఆలయ ప్రవేశం అనంతరం ఆదివారం రాత్రి బ్రహ్మోత్సవాలకు నవధాన్యాలతో అంకురార్పణ చేస్తారు. సోమవారం సాయంత్రం 6:15 గంటల నుంచి 6:30 గంటల మధ్య మీనలగ్నంలో ధ్వజారోహణం ఘట్టంతో ఉత్సవాలు ఆరంభమవుతాయి. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దంపతులు రాత్రికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలను సమర్పిస్తారు. తొమ్మిది గంటలకు పెద్దశేష వాహనసేవ ప్రారంభమవుతుంది. ఇక ప్రతిరోజూ ఉదయం,సాయంత్రం వాహన సేవలు కొనసాగుతాయి. చివరగా గరుడవాహన సేవ అత్యంత వైభవంగా సాగనుంది. ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీవారి ఆర్జిత సేవలను ఆదివారం నుంచి తితిదే రద్దు చేయనుంది. బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నేపథ్యంలో సుప్రభాతం, కల్యాణోత్సవం, వూంజలసేవ, ఆర్జిత బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి. సోమవారం నుంచి అక్టోబరు 8వరకు సుప్రభాతం, వారపు సేవ వస్త్రాలంకరణ, అభిషేకం సేవలు మినహా అన్నింటినీ రద్దు చేసింది. వికలాంగులు, వయో వృద్ధులు, చంటిబిడ్డలతోపాటు వచ్చే తల్లిదండ్రులకు ప్రత్యేక దర్శనాలను నిలిపివేయనుంది. శ్రీవారి ఆనంద నిలయం చుట్టూ అంగప్రదక్షిణను రద్దు చేసింది. విఐపి సిఫారసు లెటర్లను అంగీకరించరు. కేవలం ప్రోటకాల్ ఉన్న వారికి మాత్రమే విఐపి దర్శనాలు ఉంటాయి.

## బ్రహ్మోత్సవాల్లో సిసి కెమెరాలతో సమీక్ష

తిరుమల,సెప్టెంబర్27(ఆర్‌ఎన్‌ఎ): బ్రహ్మోత్సవాల దృష్ట్యా భద్రత కోసం ఇప్పటికే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తిరుమల ప్రత్యేకాధికారి ధర్మారెడ్డి చెప్పారు. భక్తులు భద్రంగా, సంతోషకరంగా తిరిగి వెళ్లే విధంగా తగిన ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. భక్తులు తమ సమస్యలను తెలియజేసేందుకు అనుగుణంగా టోల్‌ఫ్రీ నెంబరు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఎక్కువ మంది దర్శనం చేసుకునే విధంగా చర్యలు తీసుకున్నామని అన్నారు. ఈ ఏడాది క్యాలెండర్లు, డైరీలను బల్క్‌గా కొనుగోలు చేసేందుకు అవకాశం ఉందని టిటిడి అధికారులు చెప్పారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తిరుమల మాఢవీధులతోపాటు గ్యాలరీలు, ఘాట్‌రోడ్డుపై ప్రమాదాల నివారణ, వైద్యసేవలు, రవాణా, విద్యుత్తు దీపాలంకరణ, భద్రత వంటి అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. పోలీస్, రవాణా, ఇతర విభాగాలతో సమన్వయ సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు. విద్యుత్తు వినియోగాన్ని తగ్గించేందుకు అనుగుణంగా ఎల్‌ఈడీ బల్బులను వినియోగించినట్లు వెల్లడించారు. ఉద్యానవనాలు, అటవీ, విద్యుత్తుశాఖ అధికారులు భక్తులకు పూర్తిస్థాయిలో కనువిందు చేసేలా ఏర్పాట్లు చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం వివిధ విభాగాల్లో ఉన్న వైద్యులను కేవలం వైద్య సేవలకే వినియోగించనున్నట్లు చెప్పారు.

## అంకురార్పణ విశిష్ఠత

వైఖానస ఆగమంలోని క్రతువుల్లో అంకురార్పణం లేదా బీజవాపనం అత్యంత ముఖ్యమైనది. ఏదైనా ఉత్సవం నిర్వహించే ముందు అది విజయవంతం కావాలని కోరుతూ స్వామివారిని ప్రార్థించేందుకు అంకురార్పణం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా శ్రీవారి తరపున సేనాధిపతి అయిన శ్రీ విష్వక్సేనులవారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపుగా వెళ్లి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. అనంతరం అంకురార్పణ కార్యక్రమాల్లో భాగంగా ఆలయంలో భూవరాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టమన్నులో నవధాన్యాలను నాటుతారు. నవధాన్యాలకు మొలకలొచ్చేవరకు నీరు పోస్తారు. అంకురాలను ఆరోపింపజేసే కార్యక్రమం కాబట్టి ఇది అంకురార్పణం అయింది. అంకురార్పణ ఘట్టం తరువాత రంగనాయకుల మండపంలో ఆస్థానం నిర్వహిస్తారు. అంకురార్పణం అంటే విత్తనం మొలకెత్తడం. శాస్త్రాల ప్రకారం ఉత్సవానికి తొమ్మిది రోజుల ముందు అంకురార్పణం నిర్వహిస్తారు. శాస్త్రాల ప్రకారం ఏదైనా ఉత్సవానికి 9, 7, 5, 3 రోజులు లేదా ఒక రోజు ముందు అంకురార్పణం నిర్వహించడం ఆనవాయితీ. ఖగోళశాస్త్రంలోని సిద్ధాంతాల ప్రకారమే ఇలా చేస్తారు. మొక్కలకు అధిదేవత చంద్రుడు కాబట్టి రాత్రి సమయంలోనే విత్తనం నాటుతారు. ఆగమాల ప్రకారం విత్తనం బాగా మొలకెత్తడాన్ని ఉత్సవం విజయవంతానికి సూచికగా భావిస్తారు. పాలికలు అనే పాత్రలను విత్తనాలను నాటేందుకు వినియోగిస్తారు. బ్రహ్మపీఠాన్ని బియ్యం తదితరాలతో అలంకరించిన తరువాత బ్రహ్మ, గరుడ, శేష, సుదర్శన, వక్రతుండ, సోమ, శాంత, ఇంద్ర, ఇసాన మరియు జయ తదితర దేవతలను ఆహ్వానించి అగ్ని ద్వారా పూజలు చేస్తారు. ఆ తరువాత సోమం రాజ మంత్రాన్ని, విష్ణుసూక్తాన్ని పారాయణం చేస్తారు. విత్తనాలు నాటే సమయంలో వరుణ మంత్రాన్ని పఠించి నీళ్లు చల్లుతారు.

## బ్రహ్మోత్సవాలకు భారీగా ఏర్పాట్లు: ఇవో

బ్రహ్మోత్సవాల సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి లోటు లేకుండా ఏర్పాట్లు చేశామని టిటిడి ఇవో అశోక్ సింఘాల్ పేర్కొన్నారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు వెల్లడించారు. 30న రాత్రి ముఖ్యమంత్రి జగన్ దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని పేర్కొన్నారు. గరుడసేవ నేపథ్యంలో శ్రీవారిమెట్ల మార్గాన్ని నిరంతరం తెరచి ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వేళలను ఉదయం 9 నుంచి రాత్రి ఒంటి గంట వరకూ కొనసాగించనున్నట్లు తెలిపారు. గరుడసేవ రోజున భక్తులు ఉదయం 10 గంటల నుంచే గ్యాలరీల్లోకి వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి రెండు గంటలకు ఒక పదార్థం చొప్పున మజ్జిగ, జలప్రసాదం, టమోటా రైస్, పెరుగన్నం వంటివి అందించనున్నట్లు ఈవో పేర్కొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.